


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

visit us @ http://epaper.suryaa.com
శుక్రవారం | 24 మే 2024 | విజయవాడ

సంపుటి 17 | సంచిక 177
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi




అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు, వైశాఖ మాసం బ. పాడ్యమి రా.6.55, అనూరాధ ఉ.9.58, వర్జ్యం మ.3.43 నుంచి 5.21 వరకు
రాహుకాలం మ.3.00 నుంచి 4.30 వరకు దుర్ముహూర్తం ఉ.08.05 నుంచి 8.56 వరకు తిరిగి మ.12.21 నుంచి 1.12 వరకు

### విజయవాడ మోడీ రోడ్ షోలో
# అనుమానిత డ్రోన్లు


2 లో

- ప్రధాని రోడ్ షోలో భద్రతా వైఫల్యంపై కేంద్ర హెూంశాఖ సీరియస్
- పోలీసులపై చర్యలకు కేంద్ర హెూంశాఖ ఆదేశం
- మోడీ రోడ్ షో సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహించిన వారిపై విచారణ
- పలువురు ఐపీఎస్‌లపై చర్యలు తీసుకునే చాన్స్


### పోలింగ్ కేంద్రాల వారీగా డేటాను వెల్లడిస్తే
# గందరగోళమే

- సుప్రీంకు ఈసీ అఫిడవిట్
- వివరాలను వెబ్‌సైట్‌లో ప్రచురించడం కష్టమే
- కౌంటింగ్ ఫలితాలను మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందని ఆందోళన
- ప్రథమ, ద్వితీయ దశల పోలింగ్ శాతాలను అధికారికంగా వెల్లడించడంలో తీవ్ర జాప్యం


6 లో

సార్వత్రిక ఎన్నికల వివిధ దశల్లో నమోదవుతున్న పోలింగ్ శాతాలపై కచ్చితమైన అధికారిక సమాచారాన్ని ఎన్నికల సంఘం సకాలంలో ఇవ్వలేకపోవడంపై విమర్శలొస్తున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై సుప్రీంకోర్టు లోనూ పిటిషన్ దాఖలైంది. దీనికి కేంద్ర ఎన్నికల సంఘం స్పందించింది. ఎన్నికలు జరుగుతున్న సమయంలో పోలింగ్ కేంద్రాల వారీగా డేటాను వెబ్‌సైట్‌లో వెల్లడిస్తే అది గందరగోళ పరిస్థితులకు దారితీస్తుందని పేర్కొంది. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానానికి అఫిడవిట్ దాఖలు చేసింది.

## సెన్సెక్స్, నిఫ్టీ ఆల్‌టైమ్ రికార్డ్


5 లో

- సూచీల లాభాల పరుగు
- సెన్సెక్స్, నిఫ్టీ కొత్త గరిష్ఠాల నమోదు

## దద్దరిల్లిన దండకారణ్యం..


6 లో

- ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్..
- ఏడుగురు మావోలు హతం..
- భద్రతా బలగాల గాలింపులు

## రాజీనామా చేసే ప్రసక్తే లేదు

- విపక్ష ముఖ్యమంత్రులను అరెస్టుకు బీజేపీకి ఛాన్స్ ఇచ్చినట్టే
- ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్


6 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

### బుద్ధుని సందేశం దేశానికి
# ఎంతో అవసరం

- తెలంగాణలో బౌద్ధ భిక్షువులకు తగిన గౌరవం
- 29 ఏళ్ల వయసులో శాంతి కోసం బుద్ధుడు ఆలోచించిన వ్యక్తి
- రెండున్నర వేల సంవత్సరాలుగా బౌద్ధ సిద్ధాంతం నిలబడింది


6 లో

### ఉద్రిక్తతగా టీడీపీ
# 'చలో మాచర్ల'


3 లో

- అనుమతి లేదన్న పోలీసులు
- నేతల గృహ నిర్బంధం
- ఇప్పటికీ పరారీలోనే పిన్నెల్లి?
- ఎమ్మెల్యేకు లుక్ అవుట్ నోటీసులు జారీ
- అరెస్ట్ వార్తలు ఖండించిన సంగారెడ్డి ఎస్పీ
- అటు చంద్రగిరిలోనూ 144 సెక్షన్‌తో పాటు 30 యాక్ట్ అమలు

# పిన్నెల్లి ఎక్కడ?


2 లో

- సినిమాను తలపిస్తోన్న పరారీ ఎపిసోడ్
- అన్ని ఎయిర్ పోర్టులను అలర్ట్

మే 13, ఏపీలో పోలింగ్ జరిగిన రోజు. ఆ రోజున మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్వాయి గేట్ పోలింగ్ బూత్‌లో సృష్టించిన అరాచకం వీడియో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. పిన్నెల్లిపై ఏకంగా 10 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు.. లుకౌట్ నోటీసులు జారీ చేశారు. పోలీసులు అరెస్ట్ చేస్తారన్న భయంతో పిన్నెల్లి పరారయ్యారు.

## అంతా ఇంతే!



ర్యాపిడోను రేపడో అంటారేమో

### ఏపీ హైకోర్టులో
# పిన్నెల్లికి ఊరట


2 లో

- ట్విట్టర్‌లో వీడియో మార్ఫింగ్ చేసి ఉండొచ్చని వాదనలు
- జూన్ 5 వరకు ఎలాంటి చర్యలొద్దన్న ధర్మాసనం
- తదుపరి విచారణ జూన్ 6కి వాయిదా

### బంగాళాఖాతంలో అల్పపీడనం
# ఏపీలో భారీ వర్షాలు


2 లో

### రేవంత్ రెడ్డికి రైతుల కంటే
# ఎన్నికలే ముఖ్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల కంటే ఎన్నికలే ముఖ్యంగా మారాయని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన బీబీనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను సందర్శించారు.


6 లో

- గతంలో రైతులను బీఆర్ఎస్ మోసం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆగ్రహం
- కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని విమర్శ
- వ్యతిరేకత మూటగట్టుకోవడానికి బీఆర్ఎస్‌కు పదేళ్లు పడితే, రేవంత్ ప్రభుత్వానికి 5 నెలలే పట్టింది : కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి

## బంగాళాఖాతంలో అల్పపీడనం : రెండజుల పాటు ఏపీలో వర్షాలు

అమరావతి, సూర్య బ్యూరో ప్రతినిధి : బంగాళాఖాతంలో అల్పపీడనం క్రమంగా బలపడుతున్న నేపథ్యంలో మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దని అధికారులు సూచించారు. శుక్రవారం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారుతోందని వాతావరణ విభాగం తెలిపింది. ఈ నెల 26 తేదీ సాయంత్రానికి అది మరింత బలపడి తుపానుగా మారుతుందని స్పష్టం చేసింది. ఈశాన్యంగా కదులుతూ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నప్పటికీ దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ముప్పేమీ లేదని వాతావరణశాఖ స్పష్టం చేసింది. శుక్రవారం నాటికి వాయుగుండంగా మారనున్న బలమైన అల్పపీడనం కారణంగా రాగల రెండు రోజుల్లో కోస్తాంధ్ర తీర ప్రాంత జిల్లాల్లో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడిన దృఎష్ట్యా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలతోపాటు కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, సత్యసాయి జిల్లాల్లో చాలా చోట్ల మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అలాగే శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృఎష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది.





## విజయవాడ మోడీ రోడ్ షోలో అనుమానిత డ్రోన్లు

● ప్రధాని రోడ్ షోలో భద్రతా వైఫల్యంపై కేంద్ర హెూంశాఖ సీరియస్ ● పోలీసులపై చర్యలకు కేంద్ర హెూంశాఖ ఆదేశం
● మోడీ రోడ్ షో సెక్యూరిటీ బాధ్యతలు నిర్వహించిన వారిపై విచారణ ● పలువురు ఐపీఎస్‌లపై చర్యలు తీసుకునే చాన్స్

అమరావతి: విజయవాడలో ప్రధాని మోదీ రోడ్షోలో భద్రతా వైఫల్యంపై కేంద్రం సీరియస్ అయింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గ జయవాడలో ప్రధాని మోదీ రోడ్షో నిర్వహించారు.నరేంద్ర మోదీ ర్యాలీకి 45 నిమిషాల ముందు, ర్యాలీ ప్రారంభం, చివరలో డ్రోన్లు ఎగురవేయడంపై కేంద్ర హోం శాఖ సీరియస్ అయింది. ప్రధాని రోడ్షో ప్రాంతం ముందుగానే నోఫ్లై జోన్గా ప్రకటించినా డ్రోన్లు ఎలా ఎగరగలిగాయాని కేంద్ర హోంశాఖ డీజీపీని ప్రశ్నించింది. ఈ ఘటన వెంటనే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి కేంద్ర హోం శాఖ లేఖ పంపించింది. ఇప్పటి వరకూ ఇలా ప్రధాని రోడ్ షోలో అనధికారిక డ్రోన్లు ఎగిరిన విషయం బయటకు రాలేదు.
ప్రధాని మోదీ భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ చూసుకుంటుంది. ఏ మాత్రం చిన్న తేడా కనిపించినా సీరియస్ గా స్పందిస్తుంది. ప్రధాని రోడ్ షో రోజున మొదట ఓ డ్రోన్ ఎగరగడం గమనించి కిందకి దించి వేయించారు. ఈ ఘటన తర్వాత మరో డ్రోన్ ఎగరకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే రోడ్ షో ముగిసే సమయంలో మరో డ్రోన్ ఎగిరింది. దీనిపై ఎస్పీజీ గ్రూప్ అప్పుడే కేంద్ర హోంశాఖకు నివేదిక పంపింది. తీవ్ర భద్రతా ఉల్లంఘనగా భావించింది. బందోబస్తు నిర్వహించిన పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా ఉండటమో.. లేకపోతే వారి అనుమతితో ఎగురవేయడమో చేసి ఉంటారని భావిస్తున్నారు.
కేంద్ర హోంశాఖ స్వయంగా ఆదేశించడంతో ఇప్పుడు డీజీపీ అసలు డ్రోన్లు ఎగురవేసిన వాళ్లు ఎవరు.. ఎందుకు ఎగురవేశారు.. పోలీసులు ఎందుకు పట్టించుకోలేదు.. ఒక వేళ పోలీసులే ఎగురవేస్తే.. నిబంధనలు ఎందుకు పట్టించుకోలేదు వంటి అంశాలపై దర్యాప్తు చేసి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మోదీ భద్రతా ఏర్పాట్లను సీనియర్ ఐపీఎస్ అధికారులు చూస్తారు. వారిలో నిర్లక్ష్యం ఎవరితో విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మోదీ పర్యటనలో భద్రతా వైఫల్యం ఇదే మొదటి సారి కాదు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన వెంటనే ..మోదీ చిలుకలూరిపేట బహిరంగసభకు హాజరయ్యారు. ఆ సభలో మొత్తం గందరగోళం ఏర్పడింది. పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరించారన్న ఆరోపణలు వచ్చాయి. ఫలితంగాఆ సభ రక్షణ బాధ్యతల్లో ఉన్న పలువురు ఎస్పీలపై ఈసీ వేటు వేసింది. ఈ సారి మరికొంత మంది ఐపీఎస్ అధికారులపై చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## పిన్నెల్లి ఎక్కడ?

● సినిమాను తలపిస్తోన్న పరారీ ఎపిసోడ్ ● అన్ని ఎయిర్ పోర్టుల అలర్ట్



మాచర్ల.... మే 13, ఏపీలో పోలింగ్ జరిగిన రోజు. ఆ రోజున మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృఎష్ణారెడ్డి పాల్వాయి గేట్ పోలింగ్ బూత్ లో సృఎష్టించిన అరాచకం వీడియో సంచలనం సృఎష్టించిన విషయం తెలిసిందే. పిన్నెల్లిపై ఏకంగా 10 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు.. లుకౌట్ నోటీసులు జారీ చేశారు. పోలీసులు అరెస్ట్ చేస్తారన్న భయంతో పిన్నెల్లి పరారయ్యారు. తన సోదరుడు వెంకట్రామిరెడ్డితో కలిసి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ముందు సంగారెడ్డి, తర్వాత ఇస్నాపూర్ ఫామ్ హౌస్.. ఆ తర్వాత ఇంకెక్కడ ఉన్నారన్నదీ తెలియలేదు. అన్ని ఎయిర్ పోర్టులను అలర్ట్ చేశారు.
పిన్నెల్లి హైదరాబాద్ లో ఉన్నారన్న విషయం తెలుసుకున్న పోలీసులు.. ఇందూ విల్లాస్ కు చేరుకున్నారు. అక్కడ ఆయన ఇంటి నుంచి కారు బయటకు రాగా.. ఆ కారును ఫాలో అయ్యారు. నేషనల్ హైవే 65పై కారు స్పీడుగా వెళ్లడం గమనించి.. సంగారెడ్డి జిల్లా పోలీస్ యంత్రాంగం సహాయం కోరారు ఏపీ పోలీసులు. పిన్నెల్లికోసం సంగారెడ్డి పోలీసులు కంది కూడలి వద్ద పాగా వేశారు. టెంపరరీ చెక్ట్ పోస్ట్ ఏర్పాటు చేసి.. అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే.. కారు హైవే వైపు రాకుండా.. పటాన్ చెరు వైపు దారి మళ్లింది. రుదద్రం వైపుగా కొంతదూరం వెళ్లిన కారు.. గణేష్ తండా వద్ద ఆగిపోయింది. ఆ కారులో ఏపీలో పోలీసులకు డ్రైవర్, గన్ మ్యాన్ మాత్రమే కనిపించారు. పిన్నెల్లి ఫోన్ వారివద్దే ఉండటాన్ని చూసి షాకయ్యారు. పోలీసుల్ని పిన్నెల్లి తప్పుదోవ పట్టించాడని అర్థమైంది.
వాళ్లిద్దరినీ అదుపులోకి తీసుకున్న పోలీసులు.. పిన్నెల్లి గురించి విచారించగా అసలు విషయం చెప్పారు. కారు ఆగగానే ఫోన్ తమకిచ్చిన పిన్నెల్లి.. డివైడర్ దాటి రోడ్డుకు అటువైపు వెళ్లారని, అప్పటికే అక్కడ మరో వాహనం సిద్ధంగా ఉందని.. అందులో ఎక్కి హైదరాబాద్ వైపు వెళ్లిపోయారని వివరించారు. డ్రైవర్, గన్ మ్యాన్ ను సంగారెడ్డి సీసీఎస్ కు తరలించారు. అయితే.. తానెక్కడికీ పారిపోలేదని పోలీసుల సూచన మేరకు హైదరాబాద్ కు వచ్చానని పిన్నెల్లి చెబుతున్నా.. దేశం దాటి వెళ్లిపోయారన్న వార్తలు గుప్పుమంటున్నాయి.
రామకృఎష్ణారెడ్డి దుబాయ్ వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారని, పోలీసుల అప్రమత్తమై అరెస్ట్ కు రంగం సిద్ధం చేయడంతో.. ఆయన వ్యూహం బెడిసికొట్టిందని టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. పిన్నెల్లి సోదరులకు తెలంగాణలో కొందరు బిఆర్ఎస్ నేతలతో మంచి సంబంధాలు ఉన్నాయని, వారి ఫామ్హౌస్లో వారు తలదాచుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదంతా కాదు.. తాజాగా ఆయన తమిళనాడుకు వెళ్లినట్లు మరో వార్త. మరోవైపు పిన్నెల్లి వ్యవహారంలో ఏపీ పోలీసులు ఫెయిలయ్యారన్న వాదనలు బలంగా వినవస్తున్నాయి. మరింతకీ పిన్నెల్లి దేశంలోనే ఉన్నాడా ? ఉంటే ఎక్కడున్నాడు ? పోలీసులు తెలియక అరెస్ట్ చేయడంలో విఫలమయ్యారా ? తెలిసే వైసీపీ ఒత్తిళ్లకు ఏమైనా తలొగ్గారా ? అన్నది సస్పెన్స్ గా మారింది.
పాల్వాయి గేట్ ఘటన ఒక్కటే కాదు.. పిన్నెల్లి ఆదేశాలతో మాచర్ల నియోజకవర్గంలోని కొత్తపుల్లారెడ్డిగూడెంలోనూ పోలింగ్ రోజున పోలింగ్ బూత్ లో టీడీపీ ఏజెంట్లుగా ఉన్నవారిపై వైసీపీ రౌడీ మూకలు దాడిచేసిన వీడియోలు ఇప్పుడు వెలుగుచూశాయి. పిన్నెల్లి ఆదేశాలతోనే ఇదంతా జరిగినట్లు టీడీపీ శ్రేణులు పేర్కొన్నారు. నేడు టీడీపీ ఛలో మాచర్లకు పిలుపునివ్వగా అక్కడ 144 సెక్షన్ అమల్లో ఉండటంతో.. పోలీసులు అనుమతి నిరాకరించారు. మాచర్లకు రాకుండా టీడీపీ నేతలను హౌస్ అరెస్ట్ చేశారు.

## ఆది అదిరేలా... వైసిపి బెదిరేలా





● చాలా రసవత్తరంగా జమ్మలమడుగు ఎన్నికలు
● సుధీర్ రెడ్డి -ఆదినారాయణ రెడ్డిల మధ్య పోటా పోటీ ● హామీలు నెరవేర్చకపోవడంతో సుధీర్‌పై వ్యతిరేకత
● ముందుకు కదలని అభివృద్ధి.. గత ఓటమి సానుభూతి ఆదికి కలిసి వచ్చేనా?

జమ్మలమడుగు.. కడప జిల్లా జమ్మలమడుగులో 2024 ఎన్నికలు చాలా రసవత్తరంగా మారాయి. వైసీపీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి. కూటమి అభ్యర్థిగా బీజేపీ నుంచి పోటీలో ఉన్న మాజీ మంత్రి ఆదినారాయణల మధ్య జమ్మలమడుగులో గట్టి పోటీ జరిగిందంటున్నారు. సుధీర్ రెడ్డి గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచారు. అయితే నియోజకవర్గంలో అభివృఎద్ధి ప్రాజెక్టులు మరియు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో జమ్మలమడుగు నియోజకవర్గంలోని కొన్ని వర్గాల్లో ఆయన వ్యతిరేకత ఉందంటున్నారు.
ఆదినారాయణ రెడ్డి.. జమ్మలమడుగు నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2014లో వైసీపీ నుంచి గెలిచిన ఆదినారాయణరెడ్డి.. వెంటనే టీడీపీలో చేరిపోయి మంత్రి పదవి కూడా చేపట్టారు. 2019లో కడప ఎంపీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆయన కేంద్రం అండ కోసం బీజేపీ బాట పట్టారు. ఈ సారి బీజేపీ అభ్యర్థిగా తన సొంత నియోజకవర్గం జమ్మలమడుగు నుంచి పోటీలో నిలిచారు. ప్రభుత్వ వ్యతిరేకత, వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ముందుకు కదలని అభివృఎద్ధి.. గత ఎన్నికల్లో ఓడిపోయిన సానుభూతి, స్థానికంగా ఉన్న ఆదినారాయణరెడ్డికి ఉన్న బలమైన వర్గం.. ఇవన్నీ ఆయనకు ప్లస్ పాయింట్లుగా కనిపిస్తున్నాయి.
జమ్మలమడుగు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన డాక్టర్ సుధీర్ రెడ్డి, గడిచిన ఐదు సంవత్సరాలలో అధికారం ఉన్నప్పటికీ .. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎటువంటి అభివృఎద్ధి పనులు చేయించలేక పోవడం మైనస్గా కనిపిస్తుంది. నియోజకవర్గంలో ఇసుక మాఫియా, మట్టి మాఫియా ,ల్యాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా ఇలా అనేక విధాలుగా ప్రజల్ని ఇబ్బందులు గురి చేశారని ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయట.
ఆదినారాయణ రెడ్డి గతంలో మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలవడం నియోజకవర్గ అభివృఎద్ధితో పాటు ప్రజలకు కాస్తో కూస్తో మేలు చేశారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరోవైపు నియోజకవర్గం వైసీపీలో ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా గ్రూపులు ఉన్నాయి. అసమ్మతి నేతల్ని తనవైపు తిప్పుకోవడంలో ఆదినారాయణ రెడ్డి సక్సెస్ అయ్యారంటున్నారు. అలాగే ప్రజల్లో ఉన్న అసంతృఎప్తిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి .. కేంద్రం అండతో అభివృఎద్ధిని పరుగులు పెట్టిస్తానని భారీ స్థాయిలో ఇచ్చిన హామీలు జనాన్ని ప్రభావితం చేశాయంటున్నారు.
మరోవైపు ఈ నియోజకవర్గంలో చదిపిరాళ్ల కుటుంబంపై నియోజకవర్గ ప్రజల్లో ఉన్న సానుభూతి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డికి ప్లస్ అవుతుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మరి 86.68 శాతం భారీ పోలింగ్ జరిగిన జగన్ సొంత జిల్లాలోని ఈ సెగ్మెంట్లో ఓటర్లు ఎవరికి పట్టం కడతారో చూడాలి.

## ఈవీఎం ధ్వంసం ఘటన..



### ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు

అమరావతి: మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలం పాల్వాయిగేటు ఈవీఎం ధ్వంసం కేసులో ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ ఆఫీసర్గా ఉన్న సత్తెనపల్లి జూనియర్ కళాశాల అధ్యాపకుడు సుబ్బారావును ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు. పోలింగ్ అధికారిగా ఉన్న వెంకటాపురం జడ్పీ స్కూల్ అసిస్టెంట్ షహనాజ్ బేగంపైనా చర్యలు తీసుకున్నారు. ఈ ఇద్దరు అధికారులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారని గుర్తించిన జిల్లా ఎన్నికల అధికారి ఈ మేరకు చర్యలు చేపట్టారు.





## మైలవరంలో గెలుపెవరిది?

● టిడిపిలో చేరి రంగంలోకి దిగిన వసంత కృష్ణ ప్రసాద్ ● వైసిపి తరపున బరిలో సర్నాల తిరుపతిరావు యాదవ్
● గౌడ సామాజిక వర్గం ఓట్లన్నీ తనకే పడ్డాయంటున్న సర్నాల ● రెండోసారి విజయం తనదేనంటున్న వసంత
● గెలుపు ఎవరిని తీరం చేర్చేనని సర్వత్రా ఉత్కంఠ

మైలవరం ... ఏపీలో కీలక ఘట్టం ముగిసింది. 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు, 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు ఈ నెల 13న ఎన్నికలు జరిగాయి. జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఫలితాల కోసం నేతలందరూ కూడా ఎంతో ఆతృఎతుగా ఎదురు చూస్తున్నారు. దీనిలో భాగంగానే ఎన్టీఆర్ జిల్లా మైలవరం నియోజకవర్గంలో ఏ పార్టీ విజయం సాధిస్తుందో అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. వైసీపీకి గుడ్ చెప్పిన ఎమ్మెల్యే వసంత కృఎష్ణ ప్రసాద్ టీడీపీలో చేరి ఆ పార్టీ టికెట్ దక్కించుకుని మరీ ఈ ఎన్నికల్లో పోటీ చేశారు. ఇక వైసీపీ నుంచి బీసీ కులానికి చెందిన సర్నాల తిరుపతిరావు యాదవ్ బరిలో దిగారు.వీరిద్దరిలో ఎవరు విజయం సాధిస్తారో అని మైలవరం నియోజకవర్గ ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. పోలింగ్ అనంతరం వచ్చిన అంచనాలు ,విశ్లేషణలు చూసుకుంటే వసంత కృఎష్ణ ప్రసాద్ రెండోసారి విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఆయన వైసీపీ నుంచి పోటీ చేసిన కచ్చితంగా విజయం సాధించేవారని టీడీపీ నేతలు చెప్పడం ఇక్కడ విశేషం.టీడీపీ క్యాడర్ అంతా కూడా వసంత గెలుపు కోసం కృఎషి చేసిందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. దాంతో వసంత గెలుపు ఖాయమని ఆ పార్టీ చెబుతోంది. అయితే వైసీపీ కూడా గెలుపు ఆశలను వదులుకోవడం లేదు. మహిళలు వృఎద్ధులు పెద్ద ఎత్తున పోలింగ్ బూతులకు వచ్చారని వారి ఓట్లు అన్నీ కూడా తమకే అని భావిస్తున్నారు.మైలవరంలో గౌడ సామాజిక వర్గం కూడా ఎక్కువగా ఉంది. ఆ ఓటు బ్యాంకుపై వైసీపీ గట్టిగానే ఆశలు పెట్టుకుంది. దీనికి తోడు బీసీ సామాజిక వర్గం కూడా తమకు కలిసి వస్తుందని విశ్లేషించుకుంటున్నారు. రెడ్డిగూడెం, మైలవరం, జి. కొండూరు మండలాలు వైసీపీకి అనుకూలంగా పోలింగ్ జరిగినట్టు తెలుస్తోంది. ఇబ్రహింపట్నం, కొండపల్లి, గొల్లపూడి వంటి మండలాలు టీడీపీకి అనుకూలంగా ఉన్నాయని తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు వైసీపీకి మద్దతుగా ఉండగా, పట్టణ ఓటర్లు టీడీపీ వైపు మొగ్గు చూపించారు. తటస్థ ఓటర్లు ఏ పార్టీకి అండగా ఉంటే ఆ పార్టీ విజయం సాధించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరీ వచ్చే ఎన్నికల్లో మైలవరం నియోజకవర్గ ప్రజలు ఏ పార్టీకి అండగా ఉంటారో చూడాలి.

## ఏబీవీ సస్పెన్షన్ రద్దు నిలిపివేత
## పిటిషన్‌పై తీర్పు రిజర్వు



అమరావతి: సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ రద్దు నిలిపివేత పిటిషన్పై ఏపీ హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఏబీ వెంకటేశ్వరరావును రెండోసారి సస్పెండ్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతూ..ఈ నెల 8న క్యాట్ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వుల మేరకు విధుల్లోకి తీసుకోకుండా జాప్యం చేసిన రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి క్యాట్ ఆదేశాలను సవాలు చేస్తూ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీనిపై హైకోర్టు విచారణ జరిపింది. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

## ఏపీ హైకోర్టులో పిన్నెల్లికి ఊరట

● ట్విట్టర్‌లో వీడియో మార్ఫింగ్ చేసి ఉండొచ్చని వాదనలు
● జూన్ 5 వరకు ఎలాంటి చర్యలొద్దన్న ధర్మాసనం
● తదుపరి విచారణ జూన్ 6కి వాయిదా



అమరావతి: ఏపీ హైకోర్టులో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృఎష్ణారెడ్డికి ఉరట లభించింది. ఆయనకు షరతులతో కూడిన బెయిల్ను హైకోర్టు మంజూరు చేసింది. జూన్ 5 వరుకు ఎలాంటి చర్యలు తీసుకోద్దని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ జూన్ 6కి వాయిదా వేసింది.
కాగా, పిన్నెల్లి రామకృఎష్ణారెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్పై ఏపీ హైకోర్టు విచారణ చేపట్టింది. సంఘటన ఈనెల 13న జరిగితే.. 15న ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశారని ఎమ్మెల్యే పిన్నెల్లి తరవున న్యాయవాది నిరంజన్రెడ్డి తన వాదనలు వినిపించారు. ముందు ఎఫ్ఐఆర్లో గుర్తు తెలియని వ్యక్తులు అని పేర్కొన్నారని.. తర్వాత లోకేష్ ట్విట్టర్లో వీడియోను చూసి ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవడంపై నిరంజన్రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.
ట్విట్టర్లో వీడియో మార్ఫింగ్ చేసి ఉండొచ్చని నిరంజన్ రెడ్డి తెలిపారు. ఏడేళ్లలోపు శిక్ష పడే సెక్షన్లు కావడంతో పిన్నెల్లికి ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరిన నిరంజన్రెడ్డి.. సుప్రీంకోర్టు అర్నేష్ కుమార్ కేసులో మార్గదర్శక సూత్రాల ప్రకారం ఏడేళ్లలోపు శిక్షపడే సెక్షన్లు ఉంటే 41 నోటీసులు ఇవ్వాలని ఉందని పేర్కొన్నారు. కౌంటర్ దాఖలు చేసేందుకు సమయం కావాలని కోరిన ఎన్నికల కమిషన్ తరవు న్యాయవాది కోరారు.

## పాల్‌కు కూడా 175 !

● జగన్ వైనాట్ 175 నుంచి 151 కన్నా ఎక్కువంటున్నాడు
● కూటమికి 120-125 సీట్లు వస్తాయన్న రఘురామ జోస్యం..!



హైదరాబాద్.... ఏపీలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈసారి నమోదైన రికార్డు పోలింగ్ శాతం అన్ని పార్టీల్లోనూ ధీమా పెంచేసింది. విజయంపై ఎవరూ తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల ముందు వరకూ వైనాట్ 175 అన్న సీఎం జగన్ కాస్తా గతంలో సాధించిన 151 సీట్ల కంటే ఎక్కువ సీట్లు గెల్చుకోబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నేతలు సైతం తాము 140 సీట్ల వరకూ గెల్చుకుంటామని చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ కూటమికి 120-125 సీట్లు వస్తాయని రఘురామ ఇప్పటికే జోస్యం చెప్పారు. ఇవాళ మరోసారి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై రఘురామకృఎష్ణంరాజు స్పందించారు. కోనసీమ జిల్లా అయినవిల్లి, వాడపల్లి ఆలయాన్ని దర్శించుకున్న రఘురామ.. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి మంచి పాలన రావాలని అయినవిల్లిలో దేవుడిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో దుష్ట పరిపాలన అంతమవ్వాలని దేవుణ్ణి కోరుకోవడం జరిగిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారని ఆయన జోస్యం చెప్పారు.
టీడీపీ కూటమి ఈసారి కనీసం 125 సీట్లు గెల్చుకోబోతోందని రఘురామ అంచనా వేశారు. ఎన్నికల ఫలితాల తర్వాత మరోసారిఈ ఆలయాలకు వచ్చి దర్శనం చేసుకొంటానన్నారు. సీఎం జగన్ వైనాట్ 175 నినాదంపై స్పందిస్తూ.. ఇప్పుడు కేఏ పాల్ కూడా 175కు 175 అంటున్నారని రఘురామ ఎద్దేవా చేశారు. అలాగే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృఎష్ణారెడ్డి ఈవీఎం ధ్వంసం ఘటనపై స్పందిస్తూ.. ఎన్నికల రిగ్గింగ్ అరికట్టడానికి వెళ్తే ఇన్ని కేసులా అని సాక్షిలో వాపోతున్నారని ఆక్షేపించారు. జూన్ 4వ తేదీన యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ (వైయస్సార్ సీపీ) పార్టీకి పెద్ద కర్మ నిర్వహించబోతున్నామని రఘురామ తెలిపారు.

## జూన్ 4న ఊరేగింపులు రద్దు..

● క్రాకర్స్, , ర్యాలీలపై నిషేధం ● ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
● రాష్ట్రవ్యాప్తంగా 168 సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు

అమరావతి ... ఆంధ్రప్రదేశ్లో అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది. జూన్ 4న రాష్ట్రవ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల పరిధిలోని కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు ఇచ్చింది. జూన్ 4న ఆంధ్రప్రదేశ్లో ఎలాంటి ర్యాలీలు, ఉరేగింపులకు అనుమతులు లేవని స్పష్టం చేసింది. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా విక్రయాలు, వాడకంపై నిషేధం విధించింది. ఎవరైనా ఆంక్షలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. జిల్లాల వారీగా ఎస్పీలు ఉత్తర్వులు జారీ చేశారు. మే 13న పోలింగ్ సందర్భంగా పల్నాడు, మాచర్ల సహా పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది.
మరోవైపు.. ఏపీలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది. కౌంటింగ్ సమయం దగ్గర పడుతుండటంతో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. పోలింగ్ తర్వాత అల్లర్లలో పాల్గొన్న వారిపై ఫోకస్ పెట్టి గాలిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 168 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.
అల్లర్లకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే పలువురిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేశారు. మద్యం బాటిళ్లను, సెల్ ఫోన్లను, వాహనాలను పెద్ద సంఖ్యలో స్వాధీనం చేసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు.

సూర్య
సంపాదకీయం
విజయవాడ
శుక్రవారం
24 మే 2024
editpage@suryaa.com



ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త 'ఎలాన్ మాస్క్' తన 12వ ఏటనే వీడియో గేమ్ను రూపొందించడమే కాకుండా తదుపరి యూనివర్సిటీ విద్యను అభ్యసిస్తూనే 'స్పేస్ఎక్స్', 'టెస్లా', 'న్యూరాలింక్' అనబడే కంపెనీలకు బీజాలు వేశారు. మరో టెక్ దిగ్గజం 'మార్క్ జుకెర్బర్గ్' సెకండరీ పాఠశాల స్థాయిలోనే తన మిత్రులతో కలిసి 'ఫేస్బుక్' యాప్ను ఆవిష్కరించిన తర్వాత 'జుక్నెట్' యాప్ను తీసుకువచ్చారు. 'బనానా బాయ్ ఆఫ్ ఇండియా'గా పిలువబడే 'గోపాల్ జీ' అనే భాగల్పూర్కు చెందిన కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్ తన 17వ ఏటనే 11 ఆవిష్కరణలు చేసి నాసా, జైన్ ఇరిగేషన్, ఐబిఎం, ఐస్మార్ట్, ఎన్జైటీ అమెరికాల నుంచి ప్రశంసలు/ఆఫర్ లెటర్స్ అందుకొని అబ్బుర పరుస్తున్నాడు. మెక్సికోకు చెందిన 13 ఏండ్ల బాలుడు 'ఇయాన్ సంతోస్' అతి పిన్న వయస్సు కలిగిన 'అణు జీవశాస్త్రవేత్త'గా

## చిన్నారుల మదిలో పరిశోధనా బీజాలు నాటుదాం !

రికార్డుల్లోకి ఎక్కాడు. అమెరికాకు చెందిన 'గీతాంజలి రావు' చేసిన 'ఇన్నొవేషన్ వర్క్షాప్' ద్వారా 'కిడ్ ఆఫ్ ది ఇయర్'గా టైమ్ మ్యాగజీన్తో కొనియాడబడింది. తన 10 ఏండ్ల వయస్సులోనే నీటి కొరతను అధిగమించే నానో ఆధారిత 'యాప్ ఇన్వెంటర్'ను కనుగొని తన ప్రతిభను ప్రదర్శించింది గీతాంజలి రావు. నోబెల్ లారేట్ 'లారెన్స్ బ్రాగ్', 'సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్', 'గెలీలియో', 'సర్ ఐజాక్ న్యూటన్', 'పాస్కల్' లాంటి ప్రపంచ ప్రఖ్యాత సైంటిస్టులు తమ చిరుప్రాయంలోనే పరిశోధనా స్ఫూర్తిని ప్రదర్శించడం ప్రారంభించారు. సైన్స్, టెక్నాలజీల మధ్య కనిపించనంత చిన్న రేఖ దాగి ఉంటుంది. ఒకే నాణ్యానికి రెండు వైపులు అన్నట్లుగా సైన్స్, ఇంజనీరింగ్ టెక్నాలజీలు ఉంటున్నాయి. సైన్స్ ప్రతిపాదించే మౌళిక సూత్రాల ఆధారంగా అనువర్తిత అంశాలపై టెక్నోక్రాట్లు కృషి చేస్తున్నారు. అందువల్లనే సైంటిస్టులతో పోల్చితే ప్రజోపయోగ టెక్నోక్రాట్లకే అధిక ఖ్యాతి వస్తున్నది. పాఠశాల విద్యార్థులకు ప్రశ్నించేతత్వం, అన్వేషణ సామర్థ్యం, పరిశోధనా స్ఫూర్తి, వినూత్న ఆలోచనలు ఉండడం సహజంగా చూస్తున్నాం. చిన్నారుల్లో దాగిన ఉత్సుకతను గమనించి వారి వినూత్న ఆవిష్కరణల ఆలోచనలు, సృజనశీల ప్రతిభలకు ఊతం ఇచ్చే విధంగా విద్యాబోధన, పరిశోధనా స్ఫూర్తిని రగల్చాలి. పాఠశాల స్థాయిలో నిర్వహించే సైన్స్ ఎగ్జిబిషన్స్, సైన్స్ ఫేర్స్, చిల్డ్రన్ సైన్స్ కాంగ్రెస్లు లాంటి వేదికల ద్వారా విద్యార్థుల్లో దాగిన వినూత్న సృజనశీల ఆలోచనలకు కార్యరూపం ఇవ్వగలిగే వాతావరణం కల్పించాలి. పాఠశాల స్థాయిలో పిల్లలు రూపొందించే ప్రాజెక్టులు అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన ఆవిష్కరణలు చేస్తూ పెద్దలు కూడా సాధించలేనంత స్థాయిలో ఉండడం గమనిస్తున్నాం. పాఠశాల విద్యార్థుల మెదళ్లను సానెబెడుతూ, ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి. స్కూల్ స్థాయిలోనే 'స్టార్టప్స్' కల్చర్ను ప్రోత్సహించాలి. పిల్లల్లో వ్యక్తిత్వ వికాసం, విషయ పరిజ్ఞానాలతో పాటు శాస్త్రీయ ఆలోచనలకు పదును పెట్టాలి. దీనిలో భాగంగానే 6 – 10వ తరగతి విద్యార్థులకు 'డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' ద్వారా 'ఇన్స్పైర్ – మనక్' అవార్డులను నెలకొల్పి పాఠశాల ప్రాంగణాలు, గదులను ప్రయోగశాలలు మార్చుతున్నారు. దీనితో పాటు 'సిఐఎస్సి', 'అటల్ థింకర్స్ ల్యాబ్స్' పథకాల ద్వారా చిన్నారుల్లో శాస్త్రీయ స్ఫూర్తి, నవ్య ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలు, శోధించాలనే ఉత్సుకత, సృజనశీల ఆలోచనలకు పునాదులు పడుతున్నాయి. మార్కులు, ర్యాంకుల వేటలో సమయాన్ని అధికంగా వెచ్చిస్తూ, తమలో దాగిన వినూత్న ఆలోచనలకు మంగళం పాడడం సర్వసాధారణంగా జరుగుతోంది. విఫలం అవుతామనే భయంతో కూడిన ఆలోచనలు, ఉపాధ్యాయుల ప్రోత్సాహం కొరవడడం, ప్రయోగశాలల కొరత, టీచర్లకు ప్రయోగశాల అనుభవాలు పూర్తిగా లేకపోవడం లాంటి కారణాలతో చిన్నారుల్లో మొలకెత్తుతున్న ఆవిష్కరణల ఆలోచనలు, సృజనశీలతలను ఆదిలోనే తుంచి వేస్తున్నామని గమనించాలి. ఇప్పటికైనా సైన్స్ సూత్రాలకు తోడుగా అనువర్తిత టెక్నాలజీ ఆలోచనలకు ఆజ్యం పోస్తూ, బాలమేధావులు కలిగిన భారతాన్ని నిర్మించుకుందాం, ఆవిష్కరణ కేంద్రంగా భారతాన్ని అగ్రగామిగా నిలుపుదాం.

# దశాబ్ది కాలంలో ఉన్నత విద్య అధోగతి

- దేశమైన నాశనమవ్వడానికి అణుబాంబులు అక్కర్లేదు
- లోపభూయిష్టమైన విద్యావ్యవస్థ తో అన్ని వ్యవస్థలు నీచ స్థితికి
- 2017నాటి జాతీయ సర్వేతో పోల్చితే, 2021సర్వేలో సగటు ఫలితాలు దిగదుడుపే
- ఆన్లైన్ ద్వారా సమాన విద్యావకాశాలు పూర్తిగా సన్నగిల్లాయంటున్న సర్వేలు
- అధ్యాపకులు లేక విశ్వవిద్యాలయాలలో పలు విభాగాలు మూసివేత



డా. యం. సురేష్ బాబు,
9989988912

దక్షిణాఫ్రికాలోని ఒక విశ్వవిద్యాలయ శిలాఫలకం పై "ఏ దేశమైన నాశనమవ్వడానికి అణుబాంబులు అక్కర్లేదు, అణ్వస్త్ర ఆయుధాలు అంతకంటే అక్కర్లేదు, ఆ దేశం లో లోపభూయిష్టమైన నిర్వీర్యమైన విద్యావ్యవస్థ అన్ని వ్యవస్థలను నీచ స్థితికి దిగజార్చుతుంది ". నేడు దేశవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు విశ్వవిద్యాలయాలలో విద్యా ప్రమాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్లలో పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం వరుసగా 32 శాతం, 35 శాతం, 37శాతం, 43శాతంగా నమోదయ్యాయని 'నేషనల్ అచీవ్మెంట్ సర్వే' పేర్కొన్నది. 2017నాటి జాతీయ సర్వేతో పోల్చితే, 2021సర్వేలో సగటు ఫలితాలు పడిపోయాయని తెలిపింది. తమిళనాడు, తెలంగాణ, మేఘాలయ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జాతీయ సగటు కన్నా దిగువన ఫలితాలు నమోదయ్యాయి. ముఖ్యంగా కరోనా సంక్షోభం విద్యార్థుల చదువుల్ని కకావికలం చేసింది. సామాజికంగా, ఆర్థికంగా మెరుగైన కుటుంబాల పిల్లలకు ఆన్లైన్ చదువులు అందుబాటులో ఉన్నాయని, మిగతావారికి కష్టసాధ్యమైందని సర్వే ఫలితాలు తెలిపాయి. ఆన్లైన్ ద్వారా సమాన విద్యావకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి అని సర్వేలు చెబుతున్న దిద్దుబాటు చర్యలకు ప్రభుత్వాలు పూనుకోవడం లేదు. భాషానైపుణ్యం, పర్యావరణ శాస్త్రం, సైన్సు, గణితం, సామాజిక శాస్త్రాలలో పిల్లలు వెనుకబడ్డారు. తాజాగా కాగ్ నివేదిక ఆసక్తికర అంశాలు బయట పెట్టింది. ఐఐటీ, ఎన్ఐటీల్లో పీజీ, పీహెచ్డీ కోర్సుల్లో ఏటా సీట్లు భారీగా మిగిలిపోతున్నాయని వెల్లడించింది.ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులకు బీటెక్తోనే మంచి ఉద్యోగాలు వస్తుండటంతో ఎక్కువ మంది విద్యార్థులు పీజీ, పీహెచ్డీ వైపు మొగ్గు చూపడం లేదు. అలాగే బీటెక్లోని కొన్ని కోర్ ఇంజినీరింగ్ కోర్సుల్లోనూ సీట్లు భర్తీ కావడం లేదు. ఈ సమస్య ప్రధానంగా కొత్త ఐఐటీల్లో కనిపిస్తోందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇక రెండు తెలుగు రాష్ట్రాలలో పరిశోధన పడకేసి దశాబ్దం అవుతుంది. ప్రతి సంవత్సరం నిర్వహించాల్సిన రీసెట్ ఎంట్రన్స్ పరీక్ష మూడు సంవత్సరాల కొకసారి నిర్వహిస్తూ ఇంటర్వ్యూలు అడ్మిషన్లు సంవత్సరం కాలం తీసుకుంటున్నారు. చాలా విశ్వవిద్యాలయాలలో అధ్యాపకులు లేక విభాగాలు మూసివేశారు. ఉన్న అరకొర అధ్యాపకులు డైరెక్టర్లు గా, ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్, రెక్టార్లు, విసి లు గా చలామణి అవుతున్నారు. నకిలీ విశ్వవిద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. 2020 లో అడ్మిట్ అయిన స్కాలర్ 2022 కు పట్టా ఇస్తున్నారు. విశ్వవిద్యాలయంలో కంప్యూటర్, ఎంబీఏ విభాగాలలో చదువు చెప్పే వారే లేరు. బాసరలో వెలసిన ట్రిపుల్ ఐఐటి పరిస్థితి ఎలా ఉందో అనంతపురంలో వెలసిన కేంద్ర విశ్వవిద్యాలయం పరిస్థితి అలాగే ఉంది. అక్కడ విసి, అధ్యాపకులు, మౌలిక సదుపాయాలు లేవు ఇక్కడ కేంద్ర విశ్వవిద్యాలయం పెట్టి ఏడు సంవత్సరాలు కావస్తున్నా అద్దె భవనంలో ఉంది. అక్కడ ఉన్న శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, కాకతీయ విశ్వవిద్యాలయాలలో పట్టుమని పది మంది శాశ్విత అధ్యాపకులు లేరు చివరికి వంద సంవత్సరాల ఘనకీర్తి ఉన్న ఉస్మానియాలో అరవై మంది అధ్యాపకులు లేరు. ఆంధ్రాలో వెలసిన నన్నయ్య, యోగి వేమన, ద్రావిడ, అంబేద్కర్, విక్రమ్ సింహపురి, పద్మావతీ, రాయలసీమ విశ్వవిద్యాలయాలలో పట్టుమని పదిమంది శాశ్విత అధ్యాపకులు లేరు. కర్నూల్ జిల్లాలో రాయలసీమ విశ్వవిద్యాలయం, ఐఐటిడిఎం, ఆంధ్ర ప్రదేశ్ ఉర్దూ విశ్వవిద్యాలయం ఉన్నాయి. అవి ఎలా ఉన్నాయి అనే సంగతి ప్రక్కన పెడితే ఇప్పుడు కొత్తగా జగన్నాథ గట్టు దగ్గర క్లస్టర్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. ఇక ఉర్దూ విశ్వవిద్యాలయం ఒకటుందని ప్రభుత్వం ఎప్పుడో మరచిపోయింది. అవి ఎలా ఉన్నాయి అనే సంగతి ప్రక్కన పెడితే ఇప్పుడు కొత్తగా జగన్నాథ గట్టు దగ్గర క్లస్టర్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేశారు. అధ్యాపకులు లేక కీలక విభాగాలు మూసివేతకు గురైనాయి పొలిటికల్ సైన్స్, పాలిమర్ సైన్స్, స్టాటిస్టిక్స్, సెరికల్చర్, జువాలజీ, బయోకెమిస్ట్రీ , ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఎకనామిక్స్, హిస్టరీ, సోషల్ వర్క్, రూరల్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్ , జియాలజీ, మ్యాథమెటిక్స్ , ఇన్స్ట్రుమెంటేషన్ ఇలా చెప్పుకుంటూ పోతే అన్ని విభాగాలల్లోను ఒకే ఒక్కరితో నడుపుతున్నారు. ఇక్కడ పని చేసే శాశ్విత అధ్యాపకులు మైనర్,మేజర్ రీసర్చ్ ప్రాజెక్టులకు అప్లై చేసిన పాపాన పోవడం లేదు. రీసర్చ్ గ్రాంట్ అనేది తెలియని స్థితిలో అధ్యాపకులు ఉన్నారు. రీసర్చ్ గ్రాంట్లే కాదు కాన్ఫరెన్సు లు, సెమినార్, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలకు, స్టాఫ్ డెవలప్మెంట్ కోర్సులు, రిఫ్రెషర్ , ఓరియంటేషన్ కోర్సులు దశాబ్ద కాలంలో జరగలేదు. అకడమిక్ స్టాఫ్ కాలేజీలు, ఎలెక్ట్రానిక్ మల్టీమీడియా రీసర్చ్ సెంటర్లు నిధులు లేక పని లేక వెలవెలబోతున్నాయి. అధ్యాపకులకు బోధనా సామర్థ్యాలు లేక కొత్త విషయాల పట్ల ఆసక్తి చచ్చిపోయింది. ఇక ఫిజిక్స్, కెమిస్ట్రీ , ఇంజనీరింగ్, ఇన్స్ట్రుమెంటేషన్, ఎలెక్ట్రానిక్స్, జువాలజీ,వృక్ష శాస్త్ర విభాగంలో టెక్నీషియన్లు, ల్యాబ్ అటెండర్లు లేక ప్రయోగ శాలలు మూతపడ్డాయి. ఇరవై సంవత్సరాల క్రిందట విశ్వవిద్యాలయంలో సీటు రావాలంటే గగనంగా ఉండేది. ఒకప్పుడు విశ్వవిద్యాలయంలో సీటు కలగా ఉండేది కానీ ఇప్పుడు గుదిబండగా మారింది. పది సబ్జెక్టులు, నాలుగు ప్రాక్టికల్స్ ఉన్న విభాగంలో ఇద్దరు అధ్యాపకులు ఎలా చెప్పగలరు? చాలా మంది అధ్యాపకులు ఎవడెట్లా పోతే నాకెందుకు ఇంకా రెండు సంవత్సరాలు ఉంటే నేను రిటైర్ అయిపోతాను ఈ లోగా ఏదో అదృష్టం బాగుండి దిక్కుమాలిన విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా వెళితే సరిపోతుంది అనుకుంటున్నారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి తీరు డబ్బే పరమావధిగా ఉంది. తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి అవినీతి కేసులో అరెస్టు కాగా, కాకతీయ యూనివర్సిటీ వీసీ పై విజిలెన్స్ దర్యాప్తులు, మరొక ఉపకులపతి తన బంగ్లా నవీకరించడానికి కోట్ల రూపాయలు ఖర్చు చేశాడు. అనుబంధ కళాశాలలకు అదనపు కోర్సులు రావాలన్నా, అధ్యాపకుల రాటిఫికేషన్ కావాలన్న లక్షలు ముడుపు చెల్లించుకోవాల్సిందే. విద్య ప్రమాణాలు పెంచుదాం, విద్యార్థులకు పాఠాలు బోధి ద్దాం అనే తపన ఎవరికీ లేదు. పేపర్లు, పుస్తకాలు వ్రాసి అకడమిక్ గా అభివృద్ధి పొందుదాం అని అనుకోవడం లేదు. అధ్యాపకుల సమస్య ఉందని తెలిసిన ప్రభుత్వాలు ఉదాశీనంగా ఉండడం చూస్తుంటే ప్రభుత్వం విద్యను పూర్తిగా విస్మరించిందని చెప్పవచ్చు. రౌతు మెత్తగుంటే గుర్రం మూడు కాళ్లతో పరుగెత్తిందంటారు. యుజిసి, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ఇతర నియంత్రణ సంస్థల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేటు విశ్వవిద్యాలయాల అడ్డు అదుపు లేకుండా పోయింది. అడుగు వ్యవసాయ భూమి లేకపోయినా అగ్రికల్చర్, హార్టికల్చర్, పారెస్ట్రీ, అగ్రికల్చర్ మేనేజిమెంట్ కోర్సులు నడుపుతూ ఎలాంటి గుర్తింపు లేకున్నా విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెడుతున్న విశ్వవిద్యాలయాలపై ప్రభుత్వాలకు అదుపు లేకుండా పోయింది. మరియొక వైపు ఇలాంటి చెత్త కళాశాలలను అడ్మిషన్ పోర్టల్ లో ఉంచి ప్రభుత్వమే వీటి సీట్లను భర్తీ చేస్తున్నారు. దొంగ సర్టిఫికెట్లు, దొంగ చలాన్లు ముద్రించిన వారిపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం, ఇంకొకవైపు బడా బాబులు అన్ని అరాచక పద్ధతులలో అక్రమంగా డబ్బు దండుకుంటుంటే వారిని ప్రోత్సహిస్తున్నారు. దొంగ సర్టిఫికేట్లు, దొంగ నోట్ల చలామణి ఎంత నేరమో విద్యా సంస్థలను, విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసి అమాయక విద్యార్థులనుండి కోటాను కోట్ల డబ్బు వసూలు చేసి మూడు నాలుగు సంవత్సరాల తరువాత ఎందుకు పనికిరాని ఎక్కడ గుర్తింపు లేని సర్టిఫికెట్ ఇచ్చి బయటకు పంపుతున్నా ఏమాత్రం చర్యలకు ఉపక్రమించని ఉన్నత విద్య అధికారులు అంతే నేరానికి పాల్పడుతున్నారు. డబ్బే పరమావధిగా భావించే ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. రాష్ట్రంలో కొన్ని నర్సింగ్, బి ఎస్సి అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు షాపింగ్ కాంప్లెక్స్ లోను, కమర్షియల్, లాడ్జిలో, అద్దె భవనాలలో ఉంటున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సువిశాలమైన అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలు అని ప్రచారం చేస్తూ ఏడు సంవత్సరాలుగా కాలం వెళ్ళబుచ్చుతున్నా పట్టించుకునే నాథుడే లేదు. ఇలాంటి విశ్వవిద్యాలయంలో ఎక్కడా లేని దిక్కుమాలిన కోర్సులు ఉంటున్నాయి . బి ఎస్సి అగ్రికల్చర్, బి ఎస్సి హార్టికల్చర్, బి ఎస్సి ఫారెస్ట్రీ, ఎంబిఏ అగ్రికల్చర్. ఏ ఒక్క కోర్సుకు ఐ కార్ అనుమతి లేదు. ఇండియన్ కౌన్సిల్ ఫార్ అగ్రికల్చర్ రీసర్చ్ గుర్తింపు ఉండాలంటే కనీసం వంద ఎకరాల వ్యవసాయ భూమి ఉండాలి. ఇలాంటి విశ్వవిద్యాలయాలకు సెంటు భూమి లేదు, కళాశాలలో అగ్రికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ కోర్సులు బోధించడానికి పట్టుమని నలుగురు అధ్యాపకులు ఉండరు. ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, కులపతులు ఎక్కువగా నియంత్రణ మండళ్లల్లో పని చేసి రిటైర్ అయిన వ్యక్తులు నియమించడం జరుగుతుంది. ఎందుకంటే వీరి పరపతి ఉపయోగించి కోర్సులకు అప్రూవల్ తెస్తారని ధీమా. ఇలాంటి విశ్వవిద్యాలయంలో మూడు సంవత్సరాల విద్యనభ్యసించే విద్యార్థులకు వ్యవసాయం పై కనీస అవగాహన ఉండదు, అగ్రానమి, సాయిల్ సైన్స్, క్రాప్ ప్రొడక్షన్, హార్వెస్టింగ్, పెస్ట్ కంట్రోల్ , ప్లాంట్ పాథాలజీ, వీడ్ మేనేజిమెంట్, పెస్ట్ మేనేజ్మెంట్ పై అవగాహన లేదు. సుదూర ప్రాంతాల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి పిల్లలు ఇలాంటి విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్నారు. మూడు నాలుగు సంవత్సరాల తరువాత ఐ కార్ గుర్తింపు లేని, వ్యవసాయం పై కనీస అవగాహన లేని విద్యార్థులు వీళ్ళిచ్చే సర్టిఫికెటు తో ఎవరికి ఉద్యోగం రాదు. కనీసం వీరికి ఏమైనా వ్యవసాయం, ఫలసాయం, ఫారెస్ట్రీ పై ఏమైనా ప్రవేశం ఉన్నదా అంటే అది లేదు. రాష్ట్రంలో చాల ప్రైవేటు విశ్వవిద్యాలయాలు రీసర్చ్ సూపర్వైజర్లు లేకున్నా పిహెచ్డి లు నడుపుతున్నాయి. రీసర్చ్ విభాగం ఉండదు, గైడ్లు ఉండరు, 2020 లో చేరిన విద్యార్థికి 2018 లో అడ్మిషన్ అయినట్లు చేసి 2021 లో పిహెచ్డి ప్రధానం చేస్తున్నారు. ఎక్కడో ఉత్తరాదిన ఇలాంటి బోగస్ విశ్వవిద్యాలయాలు ఉండేవి. అనంతపురంలో వెలసిన ప్రైవేటు విశ్వవిద్యాలయం పట్టుమని ముగ్గురు డాక్టరేట్లు లేరు 28 కోర్సులలో పిహెచ్డి ప్రవేశ పరీక్షలు నిర్వహించింది. ఐదు వేలు అప్లికేషన్ ఫీజు, 25000 అడ్మిషన్ ఫీజు, ప్రతి సంవత్సరం లక్ష రూపాయలు ట్యూషన్ ఫీజు. విదేశాల నుంచి విద్యార్థులు రీసర్చ్ స్కాలర్లు గా ఉన్నారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు రీసర్చ్ గ్రాంట్లు లేవు, ఉన్న అరకొర నిధులు బ్లాక్ గ్రాంట్లు జీతభత్యాలకు సరిపోవడం లేదు. ఇప్పటికైనా మొద్దు నిద్ర మాని ఇలాంటి పనికిమాలిన విద్యాలయాల భరతం పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# కౌన్ బనేగా కింగ్...బెట్టింగ్

- విజయం ఎవరికి... మెజార్టీ ఎంత? అంతా ఇదే చర్చ
- 81.76 శాతం పోలింగ్ నమోదుతో అన్ని పార్టీలలో ఆందోళన
- టాప్ పది నియోజకవర్గాల్లో పెరిగిన పందేల జోరు
- పట్టణాలు... నగరాలు... పల్లెలు..ఎక్కడ చూసినా.. ఏ మూలనైనా ఇదే చర్చలు.
- పందాల కోసం ప్రత్యేకంగా బెట్టింగ్ యాప్లు రూపకల్పన



- పాణిగ్రాహి రాజశేఖర్
9951185876

తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల రణరంగం ముగిసింది. ఇక కాయ్ రాజా కాయ్ అంటూ.. బెట్టింగ్ ల జోరు ఊపందుకుంది. అధికార, ప్రతిపక్ష పార్టీల తరపున అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాలు చేపట్టారు. కనీవినీ ఎరగని రీతిలో ప్రజలు సైతం పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓట్లు వేశారు. ఇక నేతల భవితవ్యం ఈవీఎంల్లో నిక్షిప్తమై ఉంది. గత ఎన్నికలతో పోల్చితే ఈ సారి ఓటింగ్ శాతం కూడా పెరగడంతో అభ్యర్థులంతా ఎవరికివారే విజయం తమదేనన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఏపీ సీఎం ఎవరు అనే అంశంపై విస్తృత చర్చ జరుగుతోంది. సంక్షేమ పథకాలతో సుపరిపాలన అందించిన జగన్ మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమంటూ కొందరు పందాలు కాస్తుండగా, 14 సంవత్సరాల సుదీర్ఘ కాలం సీఎంగా చేసిన చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమే విజయ ఢంకా మోగిస్తుందంటూ మరికొందరు బెట్టింగులు వేస్తున్నారు. ముఖ్యంగా ఆయా పార్టీల ప్రథమ శ్రేణి నేతలతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు, కీలక నేతలు, అనుచరులు, కార్యకర్తలు, ఆయా పార్టీల అభిమానులు పోలింగ్ ముగిసిన మరుక్షణం నుంచే బెట్టింగ్ లు కాయడంలో తలమునకలయ్యారు. పందాల కోసం ప్రత్యేకంగా బెట్టింగ్ యాప్లు సైతం రూపొందిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా పందేల జోరు కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్ ఫలితాలపై ప్రజలంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఐదేళ్ల పాటు వివిధ సంక్షేమ పథకాలు అందించిన అధికార పార్టీకే తిరిగి అందలం కట్టబెడతారా? లేదా సూపర్ సిక్స్ పేరిట ఆకర్షణీయ పథకాల మ్యానిఫెస్టోతో ముందుకువచ్చిన కూటమికి పగ్గాలు అప్పగించనున్నారా అనేది ఈవీఎంలో భద్రంగా ఉంది. జూన్ 4న కౌంటింగ్ లో ఆంధ్రప్రదేశ్లో అధికారం చేపట్టేదెవరో తేటతెల్లం కానుంది. ముఖ్యంగా కూటమి, అధికార పార్టీ అభ్యర్థుల విజయావకాశాలతోపాటు మెజార్టీలపై కూడా జోరుగా బెట్టింగులు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయ్, మ్యాజిక్ మార్క్ ఎవరికి వస్తోంది? పిఠాపురం పీఠం ఎవరిది? మంగళగిరిలో ఎవరిది విజయం? పులివెందుల పులి ఎవరు? కడప గడపలో గట్టెక్కేదెవరు? ఎవరికి ఎంతెంత మెజారిటీ వస్తుందనే అంశాలే ప్రాతిపదికగా పందేలు వేస్తున్నారు. వేయి రూపాయల నుంచి లక్షల్లో సైతం బెట్టింగ్ రాయుళ్లు సై అంటూ ముందుకు వస్తున్నారు. మరికొందరు ఒకటికి రెండు, మూడు నిష్పత్తుల్లో సైతం పందేలు కాస్తున్నారు. పట్టణాలు... నగరాలు... పల్లెలు..ఎక్కడ చూసినా.. ఏ మూలన ఉన్న కూడళ్లల్లోనూ ఇవే చర్చలు. నలుగురు ఒకచోట కలిస్తే అక్కడ ఎన్నికల్లో విజేత ఎవరు అనే అంశంపైనే చర్చ జరుగుతుంది. రచ్చబండలు, రెస్టారెంట్లు, టీ సెంటర్లు, ఆఫీసులు, ఇలా ప్రదేశమేదైనా అందరి నోటా ఎవరు గెలుస్తారు? తమ అభ్యర్థి గెలిస్తే పందెం ఎంత? అంటూ బెట్టింగ్ జోరుగా సాగుతుంది. రాజకీయ నాయకులు, పార్టీల అభిమానులతో పాటు సాధారణ ప్రజలు పందేల బరిలో నిలుస్తున్నారు. ఇదే మంచి తరుణమంటూ పలువురు బెట్టింగురాయుళ్లు సైతం లక్షల్లో పందెం కాస్తున్నారు. ముఖ్యంగా ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లో ఎక్కడ చూసినా బెట్టింగ్ చర్చలే నడుస్తున్నాయి. ఇప్పటికే ఎన్నికలు ముగియడం, పలు సర్వే సంస్థలు ఇచ్చిన అంచనాలను లెక్కల్లోకి తీసుకొంటూ పందేలు కాస్తుంటే మరోవైపు యాప్ లు సైతం ఫోన్లలో ప్రత్యక్షమవుతున్నాయి. కొందరు మరో అడుగు ముందుకేసి పొలాలు, స్థలాలు, ఇళ్లను సైతం పందెంగా పెట్టడం గమనార్హం. కొన్నిచోట్ల మూడో వ్యక్తి దగ్గర కొంత నగదు అడ్వాన్సుగా ఇచ్చి మరీ పందేలు వేస్తున్నారు. ముఖ్యంగా గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 1:5 రేషియోలో పందేలు వేస్తున్నారు.జోరుగా పందేలు సాగుతున్న అసెంబ్లీ నియోజకవర్గాల జాబితాలో మంగళగిరి, పిఠాపురం, గుడివాడ, గన్నవరం, ఉండి, ధర్మవరం, కాకినాడ సిటీ, రాజోలు, విజయవాడ తూర్పు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లో కూటమి– వైఎస్సార్సీపీ అభ్యర్థుల గెలుపోటములపై లక్షల రూపాయల పందేలు కాస్తున్నారు. పిఠాపురంలోపవన్ కల్యాణ్ 50 వేలకు పైగా మెజారిటీ సాధిస్తారని కాకినాడకు చెందిన ఒక వ్యాపారి రెండున్నర కోట్లు పందెం కాసినట్లు తెలిసింది. కుప్పంలో చంద్రబాబు మెజారిటీ తగ్గుతుందని ఒకరు పందెం పెడితే, గతంలో కంటే పెరుగుతుందని మరికొందరు పందెం కాస్తున్నారు. పులివెందులలో జగన్ మోహన్ రెడ్డి రికార్డు మెజారిటీపై కూడా జోరుగా బెట్టింగ్ కాస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో 81.76 శాతం పోలింగ్ నమోదు కావడంతో బెట్టింగ్ ల జోరు ఊపందుకోంది. ప్రభుత్వ వ్యతిరేకత కారణమని కొందరు భావిస్తుండా సంక్షేమ పథకాలకే పోలింగ్ కేంద్రాలకు నడిపించాయంటూ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఎవరి అంచనాలు ఏవిధంగా ఉన్నా బెట్టింగ్ రాయుళ్లు మాత్రం ఈ నాలుగు రోజులు నాలుగు రూపాయలు వెనకవేసుకొనే పనిలోనే తలమునకలయ్యారు. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్ కుప్పలు తెప్పలుగా ఫోన్లలో ప్రత్యక్షమవుతూ ఆశల వలలు వేస్తున్నాయి. దీనికితోడు వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల్లో ప్రత్యేకంగా గ్రూపులు గ్రూపులు క్రియేట్ చేసి బెట్టింగ్ చేస్తున్నారు. లక్షల నుంచి కోట్ల వరకు ఉండగా, యాప్లో మాత్రం పైసల్లో చూపిస్తున్నారు. ఈ బెట్టింగ్లు ఎవరిని కోటీశ్వరులను చేస్తాయే ఎంతమందిని అప్పుల చేస్తాయో తెలియాలంటే జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే...

# ఎట్టకేలకు రూపొందుతున్నతెలంగాణ రాష్ట్ర గీతం

- దశాబ్దకాలం గా చర్చోప చర్చలతో కాల హరణం
- గత పాలకులకు అధికారికంగా ప్రకటించడానికి దొరకని సమయం
- రేవంత్ రెడ్డి కేబినెట్ 'జయ జయయే తెలంగాణ జననీ జయకేతనం'కు ఆమోదం
- సంగీత దర్శకుడు కీరవాణి సంగీతం తో అందెశ్రీ, రేవంత్ల చర్చలు
- తుది దశకు చెరుకున్న గీతం - సోనియా ఆవిష్కరించే అవకాశం

డాక్టర్.ఎస్.విజయ భాస్కర్
9290826988

తెలంగాణ రాష్ట్ర గీతంను అధికారికంగా ప్రకటించడానికి దశాబ్దకాలం పట్టింది.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు తర్వాత గత తొమ్మిది సంవత్సరాలకు పైగా పరిపాలన చేసిన నాయకులకు తెలంగాణ రాష్ట్ర గీతంను అధికారికంగా ప్రకటించడానికి సమయం దొరకలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ సమావేశంలో " జయ జయయే తెలంగాణ జననీ జయకేతనం " అనే గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించారు.జూన్ 2,2014 నాటికి దశాబ్దకాలం గడిచినందుకు దశాబ్ది వేడుకలను (ఉత్సవాలను) ఘనంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు పెద్ద ఎత్తున చేస్తున్నారు.అందెశ్రీ రాసిన జయ జయయే తెలంగాణ జననీ జయకేతనం అనే గీతాన్ని 6 నిమిషాల నుండి గంట ముప్పై నిమిషాలు ( 90 ) నిమిషాలకు ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి సంగీతం తో రాష్ట్ర గీతంగా జయ జయయే తెలంగాణ జననీ జయకేతనం అనే గీతాన్ని తెలంగాణ రాష్ట్ర గీతంగా సోనియాగాంధీ ఆవిష్కరించనున్నారు.
కేంద్ర ప్రభుత్వం మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాల సందర్భంగా అమృతోత్సవ ఉత్సవాలను పెద్ద యెత్తున నిర్వహించింది . .తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమృతోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఒక కమిటీని



ఏర్పాటు చేసి చైర్మన్ ను, సభ్యులను నియమించింది..జనవరి నెల 8 వ తేదీ నుంచి 22 వరకు అమృతోత్సవ ఉత్సవాలను పెద్ద ఎత్తున అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో కలెక్టర్లను ఉత్తర్వులు జారీచేసింది.అమృతోత్సవ ఉత్సవాల సందర్భంగా కవులను, రచయితలను, కళాకారులను సన్మానించాలని,కవి సమ్మేళనాలు నిర్వహించాలని, సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద యెత్తున నిర్వహించాలని, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రజలలో ముఖ్యంగా విద్యార్థులలో దేశ భక్తిని, జాతీయ భావనను పెంపొందించడానికి ఎంతో కృషి చేసింది.
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి 9 సంవత్సరాలు గడిచినా తెలంగాణ రాష్ట్ర గీతం ను అధికారికంగా ప్రకటించకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని అనేక మంది ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాల సందర్భంగా అమృతోత్సవ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర గీతం ను అధికారికంగా ప్రకటిస్తారని భావించారు.వారి ఆశలు అడియాశలుగానే మిగిలాయి.
ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం లో అందెశ్రీ రాసిన" జయ జయయే తెలంగాణ జననీ జయకేతనం "అనే గీతాన్ని రాష్ట్ర గీతంగా పాడేవారు.అధికార., ప్రతిపక్ష , ఉద్యోగ, ఉపాధ్యాయులు ఏ కార్యక్రమం చేసిన జాతీయ గీతం, జాతీయ గేయం, రాష్ట్ర గీతం స్థానంలో " "జయ జయయే తెలంగాణ జననీ జయకేతనం " అనే గీతాలను పాడేవారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా అదే వరుస కొనసాగుతున్నది. తెలంగాణ రాష్ట్రంలో కవులు లేరనే మాటకు స్పందించి సూరవరం ప్రతాపరెడ్డి గోలకొండ360 మందితో ప్రత్యేక సంచిక తెచ్చి తెలంగాణ లో కవులు లేరనే అపవాదం దూరం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అనేక పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు అందులో చదివే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, ఆచార్యులు, కవులు, రచయితలు అనేక మంది ఉన్నారు.వారిచేత రాష్ట్ర గీతం రాపించడమో లేదా తెలంగాణ ప్రత్యేక ఉద్యమంలో అనేక మందిని ప్రత్యేక రాష్ట్ర భావనను పెంపొందించిన "జయ జయయే తెలంగాణ జననీ జయకేతనం" అనే గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదులనుండి స్వాతంత్ర్యం సంపాదించడానికి జాతీయ గీతం, జాతీయ గేయం ఎంతో తోడ్పడ్డాయి.విద్యార్థులలో దేశ భక్తిని, జాతీయ భావనను, ప్రత్యేక రాష్ట్ర భావనను ?పెంపొందించడానికి రాష్ట్ర గీతం యొక్క పాత్ర ఎంతో ఉంటుంది.
ప్రస్తుత పరిస్థితుల్లో చాలా మంది విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలు తెలియడం లేదు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను, ఘనతంత్ర దినోత్సవ వేడుకలను జాతీయ పండుగలుగా కాకుండా సెలవు దినాలుగా భావిస్తున్నారు.

(మిగతా రేపటి సంచికలో)

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :
suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.



# అప్పుడు సోనియాగాంధీ కాళ్లు మొక్కలేదా మీరు?

● ఇప్పుడు ఆమెను ఆహ్వానిస్తామంటే వద్దంటారా? ● సోనియా దయ వల్లే తెలంగాణ ఏర్పడిందన్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ కుటుంబం మొత్తం వెళ్లి సోనియా గాంధీ కాళ్లు మొక్కిందని ఇప్పుడు ఆమెను దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానిస్తే తప్పేమిటని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రశ్నించారు. సోనియా గాంధీని ఏ హోదాలో దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నారని హరీశ్ రావు ప్రశ్నించారు. దీంతో ఆయనపై రామ్మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

సోనియా దయ వల్లే తెలంగాణ ఏర్పడిందన్నారు. యువకుల ఆత్మహత్యలు చూసి, బీడు బారిన ప్రాంతానికి నీళ్ళు ఇవ్వాలని, నిధులతో తెలంగాణ సస్యశ్యామలంగా ఉండాలని ప్రత్యేక రాష్ట్రం ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ ప్రజల బాధను చూడలేక కాంగ్రెస్ రాష్ట్రాన్ని ఇస్తే... కేసీఆర్ మాత్రం జీతాలు ఇవ్వలేని పరిస్థితికి తీసుకువచ్చారని మండిపడ్డారు. సోనియా గాంధీని తెలంగాణ దేవతగా ప్రజానీకం గౌరవిస్తున్నారన్నారు. కానీ తెలంగాణ వ్యతిరేకులకు విందు భోజనాలు ఏర్పాటు చేసింది బీఆర్ఎస్ వాళ్లే అన్నారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించిన వారిని మంత్రివర్గంలోకి తీసుకున్న ఘనత కేసీఆర్దే అన్నారు. బీజేపీ, స్మృ స్వరాజ్ తెలంగాణ ఏర్పాటు విషయంలో సోనియా గాంధీని ప్రశంసించారని రామ్మోహన్ రెడ్డి గుర్తు చేశారు. కేంద్రం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు బీఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని విమర్శించారు. బోనస్ను సన్న వడ్లతో ప్రారంభించి దొడ్డు వడ్ల వరకు కొనసాగిస్తామన్నారు.

# బుద్ధుని సందేశం దేశానికి ఎంతో అవసరం

● తెలంగాణలో బౌద్ధ భిక్షువులకు తగిన గౌరవం ● 29 ఏళ్ల వయసులో శాంతి కోసం బుద్ధుడు ఆలోచించిన వ్యక్తి ● రెండున్నర వేల సంవత్సరాలుగా బౌద్ధ సిద్ధాంతం నిలబడింది



హైదరాబాద్: తెలంగాణలో బౌద్ధ బిక్షులకు తగిన గౌరవం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంతడ్డి వ్యాఖ్యానించారు. రాజ్యం, అధికారం ఉండి వాటిని కాదని 29 ఏళ్ల వయసులో శాంతి కోసం బుద్ధుడు ఆలోచించారన్నారు. రెండున్నర వేల సంవత్సరాలుగా బౌద్ధ సిద్ధాంతం నిలబడి ఉందని ఉద్ఘాటించారు. సికింద్రాబాద్లోని మహేంద్ర హిల్స్లో గురువారం మహబోధి బుద్ధవిహార్లో జరిగిన బుద్ధపూర్ణిమ వేడుకల్లో ముఖ్యఅతిథిగా రేవంతడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగిందని తెలిపారు. ఈ ప్రపంచం యొక్క నిజ స్వరూపాన్ని తెలుసుకోవడానికి బుద్ధుడు చిన్న వయస్సులోనే ఇల్లు వదిలిపెట్టి ఆనాడు అమలులో ఉన్న వివిధ మార్గాలు, పద్ధతులని అనుసరించి అనేక మంది ఆధ్యాత్మిక గురువులతో సాంగత్యం చేసి చివరికి 35 సంవత్సరాల వయస్సులో జ్ఞానోదయాన్ని పొందాడు. ఆ తరువాత బౌద్ధాన్ని గురించి తెలుసుకుని ప్రపంచమంత పర్యటిస్తూ ధర్మ ప్రచారం చేసి 80 సంవత్సరాల వయస్సులో నిర్యాణము పొందాడు. అని వివరించారు. తనని పెంచి పెద్ద చేసిన మేనత్త తనకి సన్యాసమిమ్మని వచ్చేసరికి కాదనలేక అప్పటినుండి ఆడవారికి కూడా సన్యాసాశ్రమ ప్రవేశాన్ని కల్పించాడు. ఆడవారు కూడా తాను స్థాపించిన బౌద్ధంలోకి రావడం మొదలయ్యాకా 2500 సంవత్సరాలపాటు మనగలిగిన బౌద్ధం 500 సంవత్సరాలపాటు మాత్రమే ఉంటుందని చెప్పాడన్నారు రేవంత్. ప్రతి పనిని ధ్యానంగా చేయాలన్న సూచనలో చాలా అర్థం ఉందని ఈ సూక్తిలో నుంచి ఎంతో స్ఫూర్తిని పొందారని చెప్పారు. ఏ పని అయినా తాను ఎంతో ధ్యానంగా చేస్తానని స్పష్టం చేశారు. ధ్యాన మందిరం కోసం స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ నుంచి నిధులు మంజూరు చేస్తానని అన్నారు.

# రాజీనామా చేసే ప్రసక్తే లేదు

● విపక్ష ముఖ్యమంత్రులను అరెస్టుకు బిజేపీకి ఛాన్స్ ఇచ్చినట్టే
● ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్



ఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో జైలుకు వెళ్లిన ఆప్ జాతీయ కన్వీనర్, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్పై బయటకు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, జైలు నుంచే పాలనా వ్యవహారాలు చేస్తున్నానని చెబుతున్న ఆయనను.. రాజీనామా చేయాలని భాజపా నేతలు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఢిల్లీ సీఎం స్పందించారు. తాను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా చేయనని తేల్చి చెప్పారు. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో భాజపాపై మరోసారి విమర్శలు గుప్పించారు.

**మురికివాడల్లో పని చేశా:** గతంలో ఇన్కమ్ టాక్స్ కమిషనర్ పదవిని వదులుకుని ఢిల్లీలోని మురికివాడల్లో పని చేశా. 2013లో ముఖ్యమంత్రి పీఠమెక్కిన 49 రోజుల్లోనే ఆ పదవికి రాజీనామా చేశా. నాడు ఎందుకు రాజీనామా చేశావని ఎవరూ అడగలేదు. చిన్న ఉద్యోగాన్ని కూడా ఎవరూ వదులుకోరు.. అలాంటిది సీఎం కుర్చీని కాదనుకున్నా. ప్రస్తుతం నేను ప్రజల కోసం పోరాడుతున్నా. అందుకే రాజీనామా చేయలేదు అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

**అలా చేస్తే.. వారి అరెస్టు తప్పదు :** 2015లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 67.. 2020లో 62 సీట్లను ఆప్ గెలుచుకుంది. ప్రస్తుత ఎన్నికల్లో ఆప్ను ఓడించలేమని భావించిన ప్రధాని మోదీ.. నన్ను అరెస్టు చేయించారు. తప్పుడు కేసులతో ఆప్ కీలక నేతలు మనీశ్ సిసోదియా, సంజయ్ సింగ్ సహా మరికొందరిని భాజపా అరెస్టు చేయించింది. ఈ కేసు (మద్యం కుంభకోణం) పెద్ద బూటకం. ఒకవేళ నేను రాజీనామా చేస్తే మిగతా రాష్ట్రాల్లో ఉన్న ప్రతిపక్ష ముఖ్యమంత్రులను కూడా అరెస్టు చేసే అవకాశం కేంద్రంలోని భాజపాకు ఇచ్చినట్లే అవుతుంది. తర్వాత బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ను కూడా అరెస్టు చేయవచ్చు. అందుకే రాజీనామా చేయను అని సీఎం ఆరోపించారు. జైల్లో తనను ఎంతో వేధించారని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అయినా, ఆప్ను నాశనం చేయలేరని.. వారి ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవని అన్నారు. జైల్లో ఉండే ఢిల్లీ పాలన బాధ్యతను నిర్వర్తించేందుకు వీలుగా అవకాశం కల్పించాలని కోర్టుకు విజ్ఞప్తి చేస్తానని కేజ్రీవాల్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో మధ్యంతర బెయిల్పై బయటకు వచ్చిన సీఎం.. జూన్ 2న తిరిగి జైలుకు వెళ్లనున్నారు.

## ఛత్తీస్ఘడ్ మరో భారీ ఎన్కౌంటర్

● 800 మంది పోలీసులతో ఆపరేషన్
● ఏడుగురు నక్సల్స్ హతం



రాయ్పూర్ : దేశంలో లోక్సభ ఎన్నికలు జరుగుతున్న వేళ.. ఛత్తీస్గఢ్లో వరుస ఎన్కౌంటర్లు జరగడం తీవ్ర ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి. పోలీసులు, భద్రతా బలగాలు కలిసి మొత్తం 800 మంది చేపట్టిన ఆపరేషన్లో తుపాకుల మోత మోగిపోతోంది. భద్రతా బలగాలకు, నక్సలైట్లకు మధ్య జరుగుతున్న భీకర పోరుతో అడవుల్లో అలజడి నెలకొంది. ఇక ఇప్పటివరకు జరిగిన కాల్పుల్లో ఏకంగా ఏడుగురు నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. సంఘటనా స్థలంలో భారీగా ఆయుధాల డంప్, పేలుడు పదార్థాలు సహా కీలక వస్తువులు స్వాధీనం చేసుకున్నారు.

ఛత్తీస్గఢ్లోని నారాయణ్పూర్ జిల్లాలో ఈ భారీ ఎన్కౌంటర్ చోటు చేసుకుంది. గురువారం ఐటీబీపీ, ఎస్టీఎఫ్, డీఆర్జీ, బస్తర్ బెటాలియన్.. స్థానిక పోలీసులు కలిపి మొత్తం 800 మంది భద్రతా బలగాలు ఈ భారీ ఆపరేషన్లో పాల్గొన్నాయి. నారాయణపూర్, బీజాపూర్, దంతేవాడ జిల్లాల పరిధిలో నిర్వహించిన ఈ జాయింట్ ఆపరేషన్లో నక్సలైట్ల స్థావరాన్ని గుర్తించి.. దానిపై బుల్లెట్ల వర్షం కురిపించారు. దీంతో పలువురు మావోయిస్టులు అక్కడికక్కడే మృతి చెందగా.. మరికొందరు తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది. ఇక భద్రతా బలగాలు జరిపిన కాల్పులకు.. మావోయిస్టులు కూడా తిరిగి ఎదురుకాల్పులకు దిగారు. దీంతో దండకారణ్యం మొత్తం దద్దరిల్లిపోయింది. ప్రస్తుతం ఇంకా ఆపరేషన్ కొనసాగుతోందని.. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య పరస్పరం కాల్పులు జరుగుతున్నట్లు సమాచారం

# తైవాన్కు చైనా పనీష్మెంట్

● కొత్త అధ్యక్షుడి ప్రసంగం ఎఫెక్ట్.. ● తైవాన్ ద్వీపాన్ని చుట్టుముట్టిన చైనా బలగాలు ● నలువైపులా భారీ ఎత్తున సైనిక విన్యాసాలు



బీజింగ్/తైపీ: తైవాన్ , చైనా మధ్య మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ద్వీపంలో ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో చైనా వ్యతిరేకిగా పేరొందిన లాయ్ చింగ్-తె విజయం సాధించిన సంగతి తెలిసిందే. గత సోమవారమే ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అధ్యక్ష హోదాలో తొలిసారిగా ప్రసంగించిన లాయ్ తమను బెదిరించడం ఆపాలంటూ డ్రాగన్కు గట్టిగా చెప్పారు. దీంతో ఆగ్రహించిన బీజింగ్.. తైవాన్ చుట్టూ భారీ ఎత్తున సైనిక విన్యాసాలు చేపట్టింది. పన్ష్మెంట్ పేరుతో వీటిని నిర్వహిస్తోంది. గురువారం ఉదయం 7.45 గంటల ప్రాంతంలో ఈ ద్వీపం చుట్టూ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ కి చెందిన ఈస్టర్న్ థియేటర్ కమాండ్ మిలిటరీ డ్రిల్స్ ప్రారంభించిందని చైనా అధికారిక మీడియా వెల్లడించింది. స్వాతంత్ర్యం కోసం తైవాన్ దళాల వేర్పాటువాద చర్యలకు శిక్షగానే మేం ఈ విన్యాసాలు చేపట్టాం. మా విషయంలో బయటి శక్తుల (అమెరికాను ఉద్దేశిస్తూ) జోక్యం, రెచ్చగొట్టే చర్యలకు ఇది మా హెచ్చరిక అని ఈ కమాండ్ అధికార ప్రతినిధి లి షీ వెల్లడించారు. తైవాన్ జలసంధితో పాటు ఈ ద్వీపం మిగిలిన మూడు దిక్కుల్లో డ్రాగన్ రెండు రోజుల పాటు ఈ విన్యాసాలు కొనసాగించనుంది. ఆర్మీ, నేవీ, వాయుసేన, రాకెట్ దళాలు సంయుక్తంగా ఇందులో పాల్గొన్నాయి. లక్ష్యాలపై తమ దాడుల శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తున్నాయి.

**అలర్ట్ అయిన తైవాన్..**

చైనా విన్యాసాల నేపథ్యంలో తైవాన్ అప్రమత్తమైంది. పరిస్థితులు తీవ్రంగా మారితే తక్షణమే ప్రతిస్పందించేందుకు వీలుగా యుద్ధ విమానాలను, క్షిపణులను సిద్ధంగా ఉంచింది. నేవీ, ఆర్మీ యూనిట్లను అలర్ట్ చేసింది. ఈ డ్రిల్స్ను తైవాన్ రక్షణ మంత్రి తీవ్రంగా ఖండించారు. డ్రాగన్ అసంబద్ధ రెచ్చగొట్టే చర్యలు ప్రాంతీయ శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీస్తాయి. మేం ఘర్షణలను కోరుకోవడం లేదు. కానీ ముప్పు ముంచుకొస్తే దేనికీ భయపడం అని స్పష్టం చేశారు. శాశ్వత స్వతంత్ర దేశంగా ప్రకటించుకునేందుకు ప్రయత్నిస్తున్న తైవాన్లో ఇటీవల నూతన అధ్యక్షుడు లాయ్ చింగ్-తె తన ప్రసంగంలో చైనాను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. మమ్మల్ని భయపెట్టడం ఆపండి. సైన్యంతో రెచ్చగొట్టాలని చూడకండి.

మా దేశ సార్వభౌమత్వం, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. తైవాన్ జలసంధిలో యథాతథ స్థితి ఉండేలా మేం కృషి చేస్తాం అని అన్నారు. ఈ ద్వీపం తమ భూభాగమేనంటూ గత కొన్నేళ్లుగా వాదిస్తున్న డ్రాగన్కు ఈ వ్యాఖ్యలు మింగుడుపడలేదు. ఈ క్రమంలో ప్రతిచర్యకు దిగింది.

# జూపల్లిని బర్తరఫ్ చేయాలి

● మంత్రి పోద్బలంతో రెండు హత్యలు
● ఆ హత్యలలో మంత్రి పాత్ర లేకపోతే పోలీసులకు సహకరించాలి
● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు డిమాండ్



హైదరాబాద్: మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రోద్బలంతో నియోజకవర్గంలో రెండు హత్యలు జరిగాయని, వెంటనే ఆయనను మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు డిమాండ్ చేశారు. నాలుగు నెలల కాలంలోనే ఇద్దరి హత్యలకు కారణమైన మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ డిమాండ్ చేశారు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో బొడ్డు శ్రీధర్ రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి హత్యకు జూపల్లి కృష్ణారావే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇది మొదటి హత్య కాదు. పేరుకేమో ప్రజాపాలన.. చేస్తున్నది ప్రతీకార పాలన. ప్రతీకారంతో రగిలిపోతూ ఎన్నికల్లో వత్తాసు పలకని వారి మీద ప్రతీకారం తీర్చుకునే దిక్కుమాలిన పాలన.. ఇది కాంగ్రెస్ పాలన. ఈ హత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తమ నేతలపై దాడులు, హత్యలు జరుగుతున్నాయని వినతి పత్రాలు ఇచ్చారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నేతలపై దాడులు, హత్యలపై ముఖ్యమంత్రి రేవంతడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలని, లేకపోతే కాంగ్రెస్ నేతల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. మరణించిన శ్రీధర్ రెడ్డి తండ్రి పిటిషన్పై జూపల్లి కృష్ణారావు పేరు రాస్తే పోలీసులు మంత్రి పేరు తీసేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని ఫ్యాక్షన్ సంస్కృతిని మంత్రి జూపల్లి కొల్లాపూర్లో తీసుకొచ్చారని చెప్పారు. జనవరిలో మల్లేష్ యాదవ్, ఇప్పుడు శ్రీధర్ రెడ్డి హత్యకు జూపల్లి కారణమయ్యారని ఆరోపించారు. హత్యలో మంత్రి పాత్ర లేకపోతే పోలీసులకు సహకరించాలని కోరారు. నాలుగు రోజుల క్రితం నియెజకవర్గంలో దాడులు, హత్యలు జరుగుతున్నాయని డీజీపీని తమ పార్టీ నాయకులు కలిశారని చెప్పారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ నేత హత్య జరిగిన పట్టించుకోని పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పేరుకేమో ప్రజా పాలన.. కానీ ఇక్కడే జరిగేది మాత్రం ప్రతికార్య పాలన అని విమర్శించారు. బీఆర్ఎస్ శ్రేణుల జోలికి కాంగ్రెస్ నేతలు వస్తే చూస్తు ఊరుకోమని కేటీఆర్ హెచ్చరించారు.



# కలకత్తా హైకోర్టు తీర్పును హర్షిస్తున్నాం

● మమతా బెనర్జీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతుంది ● మైనార్టీల తృప్తి కోసం ఓబీసీలను అన్యాయం చేయకూడదు ● తెలంగాణలో ఈ బీసీ పేరుతో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ● బీసీలకు అన్యాయం జరుగుతుంది ● కాంగ్రెస్, బిఆర్ఎస్ స్పందించాలి ● బిజెపి ఓబీసీ సెల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కే లక్ష్మణ్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాజ్యసభ సభ్యులు, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డా.కె.లక్ష్మణ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ లో చట్ట విరుద్ధంగా ముస్లిం ఉపకులాలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు తీర్పునివ్వడం స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నాం. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం పాటుపడుతున్న మమతాబెనర్జీ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ, విపక్ష పార్టీల నైజం బయట పడిందన్నారు.ఎటువంటి శాస్త్రీయ విధానాలు అవలంభించకుండా, సర్వేలు చేపట్టకుండా మూకుమ్మడిగా మతపరమైన రిజర్వేషన్లు చేపట్టి అన్యాయం చేస్తున్నారు.

ఏపీ, తెలంగాణలోనూ బీసీ-ఈ కోటా పేరుతో మతపరమైన రిజర్వేషన్లు ఇవ్వడం కూడా రాజ్యాంగవిరుద్ధమే. కర్నాటకలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కేటగిరీ - బి కింద ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించి బీసీలకు అన్యాయం చేస్తున్నారు.

బీసీల హక్కులను కాలరాసేలా, బీసీలను అణచివేసేలా వ్యవహరిస్తున్నారు. కేవలం మైనారిటీలను సంతృప్తిపర్చడం కోసం బీసీల ప్రయోజనాలను తాకట్టుపెట్టడం దుర్మార్గం. కలకత్తా హైకోర్టు తీర్పును అమలు చేయమని ముఖ్యమంత్రి హోదాలో మమతాబెనర్జీ మాట్లాడటం రాజ్యాంగాన్ని అవమానపర్చడమే. బీసీల హక్కుల పట్ల న్యాయస్థానం ఇచ్చిన తీర్పును పశ్చిమబెంగాల్ సీఎం మమతాబెనర్జీ గౌరవించకుండా, అమలు చేయమని మాట్లాడటాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు.

రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి, న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. వారి తీరుతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆత్మ ఘోషిస్తోంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, విపక్ష పార్టీలు కోర్టు తీర్పులను కూడా రాజకీయాలకు ముడిపెడుతూ ప్రజాస్వామ్య వ్యతిరేకులుగా మాట్లాడుతున్నారు. తెలంగాణలో బీసీ-ఈ పేరుతో 4 శాతం రిజర్వేషన్లు ముస్లింలకు అదనంగా ఇవ్వడంతో బీసీలకు అన్యాయం జరుగుతోంది. దీనిపై అనేకసార్లు ప్రశ్నించాం. బీసీల హక్కుల రక్షణ కోసం మేం ప్రశ్నిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంతో పాటు విపక్షాలు పట్టించుకోలేదు. కేవలం మైనారిటీ ఓట్ల కోసం బీసీల హక్కులను కాలరాస్తూ, బీసీల ప్రయోజనాలను పణంగా పెడుతున్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు దీనిపై స్పందించాలి.

ప్రధాని నరేంద్ర మోదీ బీసీల హక్కుల గురించి మాట్లాడితే.. ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సభల్లో రాహుల్ గాంధీ... బిజెపి ముస్లింలకు వ్యతిరేకమంటూ ప్రచారం చేశారు. చట్ట విరుద్ధంగా మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగవిరుద్ధమని కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పు.. మైనారిటీ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టులాంటిది. బీసీల హక్కులను కాలరాస్తున్న పార్టీలకు వ్యతిరేకంగా బీసీ సంఘాలు అంతా ఏకమై సంఘటితంగా పోరాటం చేయాలి. లేదంటే బీసీ సమాజం తమ హక్కులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

# రేవంత్ రెడ్డికి రైతుల కంటే ఎన్నికలే ముఖ్యంగా మారాయి

● గతంలో రైతులను బీఆర్ఎస్ మోసం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని ఆగ్రహం ● కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని విమర్శ ● వ్యతిరేకత మూటగట్టుకోవడానికి బీఆర్ఎస్కు పదేళ్లు పడితే, రేవంత్ ప్రభుత్వానికి 5 నెలలే పట్టింది : కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల కంటే ఎన్నికలే ముఖ్యంగా మారాయని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన బీబీనగర్ మండలంలోని పలు గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐకేపీ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవని విమర్శించారు. ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. గతంలో రైతులను బీఆర్ఎస్ మోసం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు.

గతంలో కేసీఆర్ వరి వేస్తే ఉరి అని రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఇప్పుడు, దొడ్డు వడ్లు సాగు చేస్తే బోనస్ ఇవ్వబోమని రేవంత్ ప్రభుత్వం ఇబ్బంది పెడుతోందని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని నిలదీశారు. రైతులకు రుణమాఫీ లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇవ్వడం లేదని విమర్శించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతి గింజను కొనేందుకు సిద్ధంగా ఉందని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఒట్లు పెట్టినంత మాత్రాన రైతులకు న్యాయం జరగదని ఎద్దేవా చేశారు. రైతుల్లో వ్యతిరేకత మూటగట్టుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వానికి పదేళ్లు పడితే కాంగ్రెస్ ప్రభుత్వానికి 5 నెలలే పట్టిందన్నారు. దొడ్డు రకం వడ్లు వేసిన రైతులకు అన్యాయం చేస్తే బీజేపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతులకు బ్యాంకర్లు రుణాలు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చడం లేదని కానీ ఢిల్లీకి సూట్కేసులు మోసుకెళుతున్నారని ఆరోపించారు. హామీలు అమలు చేయకుంటే గద్దె దిగాలన్నారు.



# మూతపడిన ప్రభుత్వ పాఠశాలలను తెరిపించాలి



● ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్ను కేటాయించాలి ● టీచర్ల బదిలీల, ప్రమోషన్ల షెడ్యూల్ను తక్షణమే విడుదల చేయాలి ● టీపీటీఎఫ్ డిమాండ్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ మరియు ఉమ్మడి నల్గొండ - వరంగల్ - ఖమ్మం జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం తేది:23-05-2024 రోజున రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్ గారి అధ్యక్షతన వర్చువల్ పద్ధతిలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి గారు సంఘ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టినారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి, డి.శ్రీనివాస్,పి.నారాయణమ్మ, పి.మహేందర్ రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి రాష్ట్ర కార్యదర్శులు యస్. కనకయ్య ,రావుల రమేష్,ఎం.రాములు, కే.భోగేశ్వర్ ,ఎస్. కవిత మరియు ఉమ్మడి వరంగల్ ,నల్గొండ,ఖమ్మం జిల్లాల పరిధిలోని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి లు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల బాల బాలికలు ఉచిత నిర్బంధ విద్యను ఒకటి నుండి 8వ తరగతి వరకు హక్కుగా పొందవచ్చునని, విద్యా హక్కు చట్టం అనేది విద్యార్థులందరికీ నాణ్యమైన, సమానమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలలను అందుబాటులో ఉంచాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలదన్ సూచించింది. కానీ గత దశాబ్దికాలంలో తెలంగాణ రాష్ట్రంలోని అనేక గ్రామపంచాయతీలలో కూడా పాఠశాలలు మూతబడి ఉన్నాయి. మూతబడిన అన్ని పాఠశాలలను తెరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని కేటాయించకపోవడం, ప్రతి తరగతికి ఒక గది లేకపోవడం,ఒకరిద్దరు టీచర్లే ఐదు తరగతులను బోధించే దుస్థితులు ఉండటము, కనీస సౌకర్యాలు కల్పించకపోవడం, ఉద్యోగ విరమణ వల్ల ఖాళీ అయిన స్థానాలను వెంటనే భర్తీ చేయకపోవడం, ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు అప్పజెప్పడం తదితర ప్రభుత్వ అస్తవ్యస్త విధానాల ఫలితంగానే సమాజం ప్రభుత్వ బడులకు దూరంగా ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వ విద్యా విధానాల లోపభూయిష్ట ఫలితంగానే బడిఈడు పిల్లలు గ్రామంలో ఉన్నప్పటికీ పాఠశాలలు మూసివేతకు గురయ్యాయని వాపోయారు. ముఖ్యమంత్రి మూసి వేయబడిన పాఠశాలలను తిరిగి తెరిపిస్తామని ప్రకటించడాన్ని ఆహ్వానిస్తున్నామన్నారు. దానికి తగిన సమాజ ఆమోద కార్యాచరణ రూపొందించాలని, విద్యా విధానాల్లో మార్పు తీసుకురావడానికి తల్లిదండ్రులకు ప్రభుత్వం హామీ పడాలని కోరారు. ప్రతి మండలంలో ప్రజాప్రతినిధులు,అధికారులు ఉపాధ్యాయ సంఘాలు, విద్యాభిమానులతో కమిటీలు ఏర్పాటు చేసి మూసి వేయబడిన పాఠశాలలను తెరిపించడంలో కృషి చేయాలని కోరారు. ప్రతి తరగతికి ఒక టీచర్ ను కేటాయించాలని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో విద్యావాలంటరీలను నియమించాలని, ప్రతి పాఠశాలకు ఒక సర్వీస్ పర్సన్ ను నియమించి పాఠశాలలకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. ఇన్చార్జిలతో నిర్వహించబడుతున్న ఎంఈఓ, డిఈఓ తదితర ముఖ్యమైన పర్యవేక్షణ పోస్టులో రెగ్యులర్ పద్ధతిలో పర్యవేక్షణ అధికారులను వెంటనే నియమించాలని, అలాగే ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## గిరిజనులను గౌరవించింది మోడీనే

### ఈటల రాజేందర్

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: దేశంలో గిరిజలను గౌరవించింది మోడీ ప్రభుత్వం మీదనే బిజెపి సీనియర్ నాయకులు ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ దేశాన్ని 50 ఏళ్ల పైన, రాష్ట్రాన్ని 40 ఏళ్ల పైన పరిపాలించింది. కానీ ఎన్నడూ దళితులకు, మైనారిటీలకు ఒరగబెట్టింది ఏదీ లేదు. నేడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కేవలం ఒక్క గిరిజన మహిళకు మాత్రమే మంత్రి పదవి ఇచ్చారు. లంబాడీ జాతికి చెందిన ఎవ్వరికీ మంత్రి పదవి లేదు. కానీ బీజేపీ రాష్ట్రంలో గిరిజన దేవతల పేరిట సమ్మక్క సారక్క విశ్వవిద్యాలయాన్నే ఏర్పాటు చేశారు. ప్రధాని మోదీ దేశంలో మొట్ట మొదటి సారిగా గిరిజన మహిళ ద్రౌపది ముర్మును రాష్ట్రపతిని చేశారు. కేంద్రకేబినెట్లో 26 మంది ఓబీసీ మంత్రులు, 15 మంది దళిత, గిరిజన మంత్రులు, మహిళలు కూడా అధిక సంఖ్యలో ఉన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని నడిపించిన సోనియా గాంధీ మహిళ అయ్యిండి కూడా గత ప్రభుత్వ కాలంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించలేదు. ఇది నరేంద్రమోదీ ప్రభుత్వం సాధించిందన్నారు.

ఏ దేశమయితే మహిళలను గౌరవిస్తుందో ఆ దేశం సుభిక్షంగా ఉంటుంది. ముస్లిం మహిళల పట్ల శాపంగా మారిన త్రివుల్ తలాక్ను రద్దు చేసి వారికి భద్రత కల్పించారు. సబ్ కాసాథ్ సబ్ కా వికాస్ అనే నినాదాన్ని ప్రధాని మోదీ అమలు పరుస్తున్నారు. ముద్ర లోన్లలో ఎక్కువ శాతం మహిళలకే అందిస్తున్నారు.

ఈ రాష్ట్రంలో 52 శాతం బీసీలుంటే కేవలం ఇద్దరు మాత్రమే మంత్రులుగా ఉన్నారు. అందుకే బీజేపీ పార్టీ మాత్రమే సమన్యాయం, సమతుల్యం పాటిస్తుంది. సమాజంలో దిక్సూచిలా ఉండే పట్టభద్రులైన మీరు ఆలోచించండి. దళిత, మైనార్టీ పట్టభద్రులు ఆలోచించండి. ఏ పార్టీ ప్రజలకు సమన్యాయం చేస్తోందో చూసి ఆ పార్టీ బలపరిచిన అభ్యర్థినే గెలిపించండి. ఈ జిల్లాలలో రేవతి భవిష్యత్తు భారతీయ జనతా పార్టీది మాత్రమే. అందుకే ఈ పార్టీ బలపరచిన ప్రేమేందర్ రెడ్డికి ఓట్లు వేసి గెలిపించాలని కోరుతున్నాను.



# నోరు జాగ్రత్త..



● మరోసారి సీఎంను తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది ● కేటీఆర్‌కు మంత్రి కోమటి రెడ్డి హెచ్చరిక

తెలంగాణ బ్యూరో/ప్రతినిధి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఓ రేంజ్లో ఫైర్ అయ్యారు. నోరు అదుపులో పెట్టుకోవాలంటూ కేటీఆర్కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరోసారి తమ ముఖ్యమంత్రి రేవంత్ని తిడితే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. కేటీఆర్ బచ్చా అని.. తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. కానీ, రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్గా గెలిచి లీడర్ అయ్యారని పేర్కొన్నారు. రేవంత్ వయసులో పోలిస్తే కేటీఆర్ చిన్న పిల్లాడు అని వ్యాఖ్యానించారు. సిరిసిల్లలో కేకే మహేందర్ రెడ్డి పొట్ట కొట్టి కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యాడని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల రిజల్ట్స్ తరువాత బీఆర్ఎస్ భూస్థాపితం అవడం ఖాయం అని అన్నారు. మేడిగడ్డ మాదిరిగానే బీఆర్ఎస్ పార్టీ కూలిపోవడం ఖాయం అన్నారు. కేసీఆర్ కూతురు కవిత చేసిన పనికి రాష్ట్రం పరువు పోతోందని వ్యాఖ్యానించారు మంత్రి. 5వ తేదీ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలే కేటీఆర్, హరీష్ రావుని కొడుతారని అన్నారు. నంది నగర్ నుండి కారులో న్యూట్రల్లో వెళ్లినా అసెంబ్లీకి చేరుకోవచ్చునని.. కట్టే పట్టుకొని అసెంబ్లీకి రాలేదు కానీ, బీజేపీ కోసం బస్సులో తిరిగారని కేసీఆర్పై విమర్శలు గుప్పించారు మంత్రి. అసలు తెలంగాణ కోసం కొట్లాడింది తామేనని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి రెండు మూడు స్థానాల్లో డిపాజిట్ వస్తుందని.. అన్ని స్థానాల్లో ఓడిపోతుందని మంత్రి కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. 12 రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ లేకుండా పోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీకి లీడర్, క్యాడర్ లేకుండా పోతారని అన్నారు. 5వ తేది తర్వాత తెలంగాణ భవన్కి తాళం వేసుకోవాల్సి వస్తుందన్నారు. కవితకు బెయిల్ రావట్లేదని కేటీఆర్ పూర్తిగా ఫ్రస్ట్రేషన్లోకి వెళ్లారని.. అందుకే ఇష్టారీతిన తమ ప్రభుత్వంపై కారుకూతలు కూస్తున్నారంటూ కేటీఆర్పై మంత్రి కోమటిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

మా ముఖ్యమంత్రిని తిడుతావా కేటీఆర్.. మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నందుకు మా రేవంత్ ని తిడుతున్నావా? 500 రూపాయలకు సిలిండర్, ఉచిత విద్యుత్ ఇవ్వడమే మేం చేస్తున్న పాపమా? హాస్టల్స్, పేదవారికి ఇచ్చే ఉచిత బియ్యం పూర్తిగా సన్నబియ్యం ఇద్దామనుకోవడం తప్పా? మేం ఇచ్చిన నోటిఫికేషన్ కాంగ్రెస్ క్లెయిమ్ చేసుకుంటుంది అంటున్నావ్. మరి మీరే ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేకపోయారు? మా ముందు చూపుతోనే హైదరాబాద్ అభివృద్ధి జరిగింది. కేసీఆర్ చేసిన పనికి మూడు డ్యాములు కొట్టుకొని పోయే ప్రమాదం ఉందని నిపుణులు చెప్తున్నారు.

కాళేశ్వరం పేరుతో కోట్ల రూపాయలు వృథా చేశారు. వైన్ షాపుల పేరు మీద కేసీఆర్ నాన్ రిఫండబుల్ పైసలు గుంజిండు. ఏకకాలంలో రుణమాఫీ చేయబోతున్నాం. మల్లన్నపై కేసులు ఉన్నాయని అంటున్నావ్.. మీ చెల్లిపై 8000 పేజీల ఛార్జ్ షీట్ పై ఏమంటావ్ కేటీఆర్? మహేశ్వర్ రెడ్డి ఏం పైరవీ చేసుకొని పదవి తెచ్చుకున్నారు? ఆయన పేరు పలకాలంటే సిగ్గుగా ఉంది? అని కేటీఆర్పై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.

**మహేశ్వర్ రెడ్డిపై మంత్రి ఫైర్..**

తెలంగాణ బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. ఈ డిపార్ట్మెంట్కి వెళ్లినా మహేశ్వర్ రెడ్డి ఆర్టీఐ అప్లికేషన్లే ఉంటున్నాయని అన్నారు. బ్లాక్ మెయిల్ చేసి పైసలు సంపాదించాలని మహేశ్వర్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఆరోపించారు. ఆర్టీఐలు కోరుతున్న మహేశ్వర్ రెడ్డి.. నిర్మల్ నియోజకవర్గానికి ఏం కావాలని ఒక్కసారైనా అడిగారా? అని మంత్రి ప్రశ్నించారు.

## కెప్టెన్ రేవంత్, టీమ్‌గా మంత్రులు



తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః తెలంగాణ మంత్రులు అంతా కలసి కట్టుగా ఉన్నారని, నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తమ కెప్టెన్ సీఎం రేవంత్ రెడ్డి, రేవంత్ నేతృత్వంలో టీమ్ ప్రజల కోసం పనిచేస్తోందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఐదేళ్లు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, అందులో సందేహాలకు తావులేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బంది ఏమీ లేదని తేల్చి చెప్పారు. కొందరు కావాలనే ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బీజేఎల్పీ నేత మహేశ్వర రెడ్డిపై జగ్గారెడ్డి విరుచుకుపడ్డారు. మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత ఉత్తమ్ కుమార్ రెడ్డిపై అనవసరంగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమీ లేకున్నా.. ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తమ్ కుమార్ తెల్లని కాగితం వంటి వారని, అనవసరంగా ఎందుకు ఇంకు చల్లుతారని ప్రశ్నించారు. బట్ట కాల్చి ఉత్తమ్ మీద వేయడం కరెక్ట్ కాదని మహేశ్వర రెడ్డికి సూచించారు. ఉత్తమ్ను ఇబ్బంది పెట్టడంలో మహేశ్వర రెడ్డికి ఒనగూరే ప్రయోజనం ఏంటో అర్థం కావడం లేదన్నారు. బీజేఎల్పీ నేత అయినప్పటికీ మహేశ్వర రెడ్డికి తగిన గుర్తింపు లభించలేదని జగ్గారెడ్డి విమర్శించారు. గుర్తింపు కోసమే ఉత్తమ్పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన చేసే ఆరోపణలకు సంబంధించి ఆధారాలు ఉంటే మీడియా ముందు పెట్టాలని సవాల్ విసిరారు. లేదంటే సైలెంట్గా ఉండాలని కోరారు. ధాన్యం కొనుగోలు విషయంలో తెలంగాణ ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుందని స్పష్టం చేశారు.

## రైతులను కుక్కలతో పోలుస్తారా?

### వ్యవసాయ మంత్రిపై హరీశ్‌రావు ఫైర్



తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః వడ్లకు బోనస్ ఏమైందని అడిగితే.. వ్యవసాయ మంత్రి కొందరు మొరుగుతున్నారంటూ రైతులను కుక్కలతో పోలుస్తున్నారని మాజీ మంత్రి హరీశ్రావు మండిపడ్డారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు బాండ్ పేపర్పై రాసిచ్చి.. వడ్లకు బోనస్ ఇస్తామని ఇవాళ సన్నాలకు మాత్రమే ఇస్తామని ఇవాళ సన్నాయి నొక్కులు నొక్కుతున్నరు. ఆ రోజు మీరు రాసిచ్చిన బాండ్ పేపర్పై సంతకాలు పెట్టారు కదా? ఈ రోజు పీసీసీ అధ్యక్షుడు, భట్టి విక్రమార్క సంతకాలు

పెట్టారు. మీరు సంతకాలు పెట్టి.. నమ్మబలికి బాండ్ పేపర్లు ఇచ్చి.. చేతుల్లో పట్టుకొని ఇవాళ వడ్లకు బోనస్ ఏమందంటే చేతులెత్తేస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు ఇవ్వరు బోనస్? ఇవాళ జగిత్యాల జిల్లాలో రైతులతో, వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడితే జిల్లా పరిధిలో 2.97లక్షల ఎకరాల్లో యాసంగిలో వడ్ల పండితే.. 2.80లక్షల ఎకరాల్లో దొడ్డు వడ్లే ఉన్నయ్. మిగితా 17వేల ఎకరాల్లో సన్నాలు సాగు చేశారు. అవి కూడా ఇంటిమందం సన్నాలు తిండిగింజల కోసం సాగు చేశారు. దానికి మీరు బోనస్ ఇచ్చేది ఏందీ? లక్ష్మారెడ్డి అనే రైతుతో మాట్లాడితే మా జగిత్యాలలో జైశ్రీరామ్ అనే సన్నవడ్లకు బయట రూ.2800-రూ.3వేలు కొనుగోలు చేస్తున్నరు. గవర్నమెంట్ ఇచ్చేది ఏందీ? ప్రైవేటులోనే కొనుగోలు చేస్తున్నారు. అందువల్ల రూ.500 కోసం ప్రభుత్వానికి అమ్మనే అమ్మరు. ఇదంతా మోసం ఉన్నది అని రైతు లక్ష్మారెడ్డి చెబుతూ వాపోతున్నరు. వాస్తవానికి దొడ్డు రకమైతే 25-30 క్వింటాళ్లు పండుతయ్. సన్న రకాలైతే 10-15 క్వింటాళ్లు పండుతయ్. దాదావు పది క్వింటాళ్ల వరకు దిగుబడి తక్కువ. రోగాలు, పెట్టుబడి, నెలరోజుల కాలం ఎక్కువ. మన ప్రాంతంలో రైతులు పండించేది రూపాయికి 90 పైసలు దొడ్డు రకమే ఎక్కువ. మరి సన్నాలకు బోనస్ ఇస్తామంటే.. రైతులను మోసం చేయడం, దగా చేయడం.. రైతులను గుండెలపై తన్నడం తప్ప ఇంకోటి లేదు అన్నారు. బాధ కలిగించే విషయం ఏంటంటే వ్యవసాయశాఖ మంత్రి అంటరు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని కొందరు మొరుగుతున్నరు అంటున్నరు. మరి రైతులు కూడా మొరుగుతున్నట్టేనా? ఈ రైతులే చెబుతున్నరు ఈ కాంగ్రెస్ గవర్నమెంట్ మమ్మల్ని మోసం చేస్తున్నది. అంటే ఇవాళ రైతులను అవమానపరుస్తున్నారు. మీరిచ్చిన మాట అమలు చేయండంటే.. మొరుగుతున్నరు అని మాట్లాడుతున్నరి అంటున్నరు.. రైతులను కుక్కలు అంటున్నరా? మీరు. ఒక మంత్రి ఏమో రైతుబంధు ఎప్పుడు ఇస్తరు అంటే చెప్పుతో కొడుతా అంటడు. అయ్యా వడ్లకు ఎప్పుడు బోనస్ ఇస్తరు.. ఇది మోసం అంటే.. రైతులను పట్టుకొని కుక్కలతో పోలుస్తూ మొరుగుతున్నరు అంటున్నరు. మిమ్మల్ని ఇందుకేనా గెలిపించింది ? అంటూ నిలదీశారు. రైతులందరూ ముక్తకంఠంతో చెబుతున్నరు. మేమందరం హైదరాబాద్కు వస్తాం. పోరాటానికి సిద్ధంగా ఉన్నాం. రూ.500 బోనస్ ఇవ్వాల్సిందేనని చెబుతున్నరు. దీనిపై స్పందించాలి. ఇప్పుడు ఏం అంటున్నరు ? ఇప్పుడు మెల్లగా భవిష్యత్తో కొంటాం అంటున్నరు. ఎన్నికలకు ముందు బాండ్పేపర్పై ఏమని రాసిచ్చారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ఇప్పుడు ఏమైందంటే దాటవేస్తున్నరు. ఇది మోసపూరిత ప్రభుత్వం. మొన్న లోక్సభ ఎన్నికల సమయంలో డబ్బాలో ఓటుపడేదాక ఏమీ మాట్లాడలేదు. ఇప్పుడు సన్నాలకే బోనస్ ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. రైతులను మోసం చేస్తున్నరు. మంత్రులు మేల్కొనాలి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి అని డిమాండ్ చేశారు.

## ప్రేమేందర్ రెడ్డి గెలుపు కోసం బిజెపి నేతల విస్తృత ప్రచారం


● ఖమ్మంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ● వరంగల్‌లో డాక్టర్ కె లక్ష్మణ్
● కొత్తగూడెంలో ఎం రఘునందన్ రావు
● శుక్రవారం మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ ప్రచారం
● బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ రాష్ట్ర బిజెపి రాష్ట్ర జాతీయ నాయకులు పాల్గొంటారని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి తెలిపారు. వరంగల్ - ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం బిజెపి నాయకులు గురువారం పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కేంద్ర పర్యాటక సాంస్కృతిక ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి గురువారం ఖమ్మం జిల్లాలో విస్తృతంగా పట్టభద్రుల నియోజకవర్గం బిజెపి అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. నల్గొండ పట్టణంలో బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు పార్లమెంటు సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ వరంగల్ - ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం బిజెపి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. సూర్యాపేట పట్టణంలో బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ ప్రచారం నిర్వహించారు. కొత్తగూడెంలో బిజెపి మాజీ శాసనసభ్యులు రఘునందన్ రావు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం 24 మే 2024న మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సాయంత్రం 6 గంటలకు వరంగల్ లో ఓరుగల్లు సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ బిజెపి శాసనమండలి నాయకులు ఏవిఎన్ రెడ్డి, బిజెపి శాసనసభ్యులు వెంకటరమణారెడ్డి, వరంగల్ - ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం పట్టభద్రుల నియోజకవర్గం బిజెపి ఎన్నికల ఇంచార్జ్ ఎన్ రామచందర్ రావు తదితరులు పాల్గొంటారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో సాయంత్రం నాలుగు గంటలకు పి ఎన్ ఎన్ ఫంక్షన్ హాల్ మడికొండ లో జరిగే గ్రాడ్యుయేట్ సదస్సులో బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొంటారు. బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ నల్లగొండ పట్టణంలో 12 గంటలకు పత్రిక విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం కోదాడలో సాయంత్రం 6 గంటలకు కాశీ విశ్వనాథ ఫంక్షన్ హాల్ లో గ్రాడ్యుయేట్ సదస్సులో పాల్గొంటారు. బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ వరంగల్ తూర్పు నియోజకవర్గం లో మధ్యాహ్నం 12 గంటలకు సదస్సులో పాల్గొని ప్రసంగిస్తారు.

## కాంగ్రెస్ గూండాల్లారా ఖబడ్దార్

### హెచ్చరించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్




తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః సీఎం రేవంతడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు అండతో కాంగ్రెస్ నాయకులు రెచ్చిపోతున్నారని.. దాడులకు బెదిరేది లేదని.. మాఫియాలను రాజ్యాంగబద్ధంగా కుప్పకూల్చే దాకా నిద్రపోనివ్వం ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. వనపర్తి జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్రెడ్డి గురువారం హత్యకు గురయ్యారు. హత్యాకాండపై ఆర్ఎస్ ప్రవీణ్కుమార్ మండిపడ్డారు. సీఎం, మంత్రి అండతో బీఆర్ఎస్ నాయకులపై పట్టపగలే దాడులు జరుగుతున్నాయని.. ప్రాణాలకు పెను ప్రమాదం పొంచి ఉందని డీజీపీకి ఫిర్యాదు చేసిన పది రోజుల్లోనే శ్రీధర్ రెడ్డి హత్యకు గురయ్యారన్నారు. ఇది ముమ్మాటికి రాజకీయ హత్యేనని.. తెలంగాణలో ప్రతిపక్షమే ఉండకూడదని పక్కా ప్లాన్ ప్రకారమే కాంగ్రెస్ ప్రభుత్వం హత్యల సంస్కృతికి తెరలేపిందని మండిపడ్డారు. ఇది ప్రజా పాలన కాదని.. ప్రతీకార పాలన అంటూ మండిపడ్డారు. మంత్రి అండదండలతో యథేచ్ఛగా జరుగుతున్న దాడుల్లో అధికార పార్టీ నిందితులను వెంటనే అరెస్ట్ చేసి వారిని పీడీ యాక్ట్ లాంటి చట్టాలను ప్రయోగించి జైల్లో పెట్టకపోవడంతోనే ఇలాంటి వరుస హత్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. నిందితులతో కుమ్మక్కైతున్న కొందరు స్థానిక పోలీసు అధికారులను, ఎంతటి వారైనా సరే, వారిపై డిపార్ట్మెంటల్ ఎంక్వైరీ చేసి తప్పకుండా శిక్షించడంతో పాటు బదిలీ చేయాలన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రి వర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని.. కొల్లాపూర్, నాగర్ కర్నూల్ , అచ్చంపేట నియోజవర్గాల్లోని సమస్యాత్మక గ్రామాల్లో వెంటనే కేంద్ర బలగాలు, స్పెషల్ పోలీసు బలగాలతో పికెట్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రాణాలకు ముప్పున్న బీఆర్ఎస్, ఇతర ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులకు వెంటనే రక్షణ కల్పించాలన్నారు. రాష్ట్రంలో అడుగంటిన శాంతిభద్రతలకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి, హోంమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## నేడు 250 కేంద్రాల్లో పాలిసెట్

హైదరాబాద్ ... పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలీసెట్) 2024 శుక్రవారం నిర్వహించేందుకు సిద్ధంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 250 కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు మొత్తం 92,808 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించబడుతుంది , పరీక్ష ప్రారంభానికి ఒక గంట ముందుగా కేంద్రాలలోకి ప్రవేశం ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటల తర్వాత అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించరు. తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, పాలీసెట్ను కలిగి ఉంది , విద్యార్థులు రెండు వైపులా ఓఎంఆర్ షీట్ వివరాలను పూరించి సంతకం చేయవలసిందిగా కోరింది. విద్యార్థులు తప్పనిసరిగా హెచ్బి బ్లాక్ పెన్సిల్, ఎరేజర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ను వెంట తీసుకెళ్లాలి. హాల్టికెట్పై ఫొటో ముద్రించని వారు పాస్పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ కార్డు వెంట తీసుకెళ్లాలి. కేంద్రాల్లోకి సెల్ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. ఎస్బిటెట్ గూగుల్ప్లేస్టోర్ స్టోర్లోని దాని ఎస్బిటెట్ అప్లికేషన్లో పాలీసెట్ పరీక్షా కేంద్రం లొకేటర్ను అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్ను దరఖాస్తులో సమర్పించడం ద్వారా తమ కేంద్రాలను గుర్తించవచ్చు. వ్యవసాయం, పశువైద్యం , ఉద్యానవనాలలో డిప్లొమాతో పాటు రాష్ట్రంలోని ప్రభుత్వ , ప్రైవేట్ పాలిటెక్నిక్లలో మూడేళ్ల ఇంజనీరింగ్ , నాన్-ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులలో ప్రవేశానికి పాలిసెట్ నిర్వహించబడుతుంది.

## మిల్లర్ల వద్ద మంత్రి ఉత్తమ్ టాక్స్ వసూళ్లు

● మిల్లర్ల నుంచి ఉత్తమ్ రూ.216 చొప్పున డిమాండ్ చేసింది నిజం కాదా
● చిట్టా విప్పుతా : బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి
● యూ ట్యాక్స్ అంటూ ఉత్తమ్ కుమార్ రెడ్డిపై మహేశ్వర్ రెడ్డి విమర్శలు
● కాంగ్రెస్ నేతల ఫిర్యాదుతో మహేశ్వర్ రెడ్డిపై కేసు
● ఆరోపణలకు కట్టుబడి ఉన్నానన్న మహేశ్వర్ రెడ్డి
● ఉత్తమ్ కుమార్ రెడ్డికి దమ్ముంటే చర్చకు రావాలని సవాల్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: రైస్ మిల్లర్ల నుంచి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి క్వింటాలుకు రూ.216 డిమాండ్ చేశారని... ఒక్కొక్క చిట్టా మొత్తం విప్పుతానని... తన వద్ద పూర్తి సమాచారం ఉందని బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు. 'యూ' ట్యాక్స్ అంటూ మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధానికి కారణమయ్యాయి. ఉత్తమ్పై యూ ట్యాక్స్ ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. మంత్రిపై మహేశ్వర్ రెడ్డి అనుచిత ఆరోపణలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో మహేశ్వర్ రెడ్డిపై కేసు నమోదయింది. ఈ అంశంపై మహేశ్వర్ రెడ్డి గురువారం స్పందించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని అందుకే ఆయన స్పందన కోసం నిన్నంతా ఎదురు చూశానన్నారు. తాను చెప్పింది వాస్తవాలు కాబట్టే ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించకుండా ముఖం చాటేశారన్నారు. ఏం చేయాలో తెలియక తనపై కేసులు పెట్టించారని మండిపడ్డారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. సిట్టింగ్ జడ్జితో కమిటీ వేయాలన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డిపై తాను చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాల సహా నిరూపించేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. పౌరసరఫరాలో ఉన్న అవకతవకలను ఏ విధంగా సరిచేస్తారో చెప్పాలని నిలదీశారు. పోలీసు కేసులతో ఏదీ పరిష్కారం కాదని హితవు పలికారు. ధాన్యం సేకరణకు సంబంధించి 25-01-24న ఇచ్చిన జీవోలో టెండర్ ప్రాసెసింగ్ చేయాలని చెప్పారని... అదేరోజు గ్లోబల్ టెండర్ పిలిచారన్నారు. గ్లోబల్ టెండర్ కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చారని... అదేరోజు కొంతమంది మిల్లర్లను పిలిచి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఏం చేశారో ఆధారాలతో బయటపెట్టమంటారా? అని ప్రశ్నించారు. క్వింటాలుకు రూ.216 ఇవ్వాలని రైస్ మిల్లర్లను డిమాండ్ చేసింది నిజం కాదా? అన్నారు. మీరు చేసిన వసూళ్ల అరాచకాన్ని బయటపెట్టమంటారా? అన్నారు. క్వింటాల్కు రూ.216 చొప్పున 35 లక్షల మెట్రిక్ టన్నులకు గాను రూ.800 కోట్ల మేర వసూలు చేశారా? లేదా? చెప్పాలని నిలదీశారు. రెండు నెలలు అవుతున్నప్పటికీ ధాన్యాన్ని ఎందుకు లిఫ్ట్ చేయడం లేదో చెప్పాలన్నారు. లక్ష మెట్రిక్ టన్నులకు పైగా బియ్యాన్ని క్వింటాలుకు రూ.2,259కి కొనుగోలు చేసి... 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని క్వింటాలుకు రూ.5,700 పెట్టి కొనడం ఏమిటి? అన్నారు. ఇందులోని మతలబు ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. ఉత్తమ్కు దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ చేశారు. పోలీసు కేసులకు, లీగల్ యాక్షన్లకు తాను భయపడేది లేదన్నారు. తాను కాలేజీలను, కోట్ల ఆస్తులను పక్కన పెట్టి రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తినని అన్నారు.

## మూసివేసే దిశగా హాస్టళ్లు

### విద్యపై ఇంత నిర్లక్ష్యమా..?

● కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించరా ● సంవత్సరం నుంచి హాస్టల్ బిల్లులు బకాయిలు
● 2 ఏళ్లుగా హాస్టల్ చెల్లించని భవనాల అద్దె బిల్లులు
● సీఎం రేవంత్ రెడ్డికి బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య లేఖ



తెలంగాణ బ్యూరో/ప్రతినిధిః తెలంగాణలో సంక్షేమ హాస్టళ్లు మూసివేసే దిశగా ఉన్నా..ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. గత 10నెలలుగా బీసీ హాస్టల్స్ మెస్ బిల్లులు చెల్లించక పోవడంతో హాస్టళ్ళకు సప్లయ్ చేసే నిత్యవసర వస్తువులు, కూరగాయలు, నూనెలు, పప్పులు, చికెన్, గుడ్డు ఇతర ఆహార దినిసులు వ్యాపారస్తులు ఆపివేస్తున్నారు. దీనితో హాస్టళ్ళ మూసివేసే పరిస్థితి ఏర్పడింది. కానీ రాష్ట్రంలో 700 బీసీ,1500 ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ళలలో నివసించే 8లక్షల మంది మెస్ చార్జీల బిల్లులు 10 నెలలుగా పెండింగ్ లో యున్నవి పాస్ కాలేదు. అద్దె భవనాల బిల్లులు, కరెంట్ బిల్లులు చెల్లించడం లేదు. దీని మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని హాస్టళ్ళ బకాయిలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం వెంటనే బడ్జెటు విడుదల చేయాలని పలుమార్లు ఉపముఖ్యమంత్రి బీసీ శాఖ మంత్రి, సంబంధిత అధికారులతో .కృష్ణయ్య తో పాటు బి.సి నాయకులు ఫణికాంత్, రఘుపతి, సందీప్, విజయ్ కుమార్ తదితరులు పలుసార్లు చర్చలు జరిపి పరిస్థితి చెప్పాం. కానీ ఫలితం లేదు. కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లిస్తున్నారా కానీ చదువుకునే పిల్లలు మెస్ బిల్లులు ఫీజులు బకాయిలు చెల్లించారా అని ప్రశ్నించారు.

కూరగాయలు, మాసం, గుడ్ల బిల్లులు, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులు గత 10 నెలలుగా చెల్లించడం లేదు. దీనితో హాస్టళ్లకు కూరగాయలు, పప్పులు, గుడ్లు తదితర వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు అప్పుల పాలయ్యారు. నిత్యావసర వస్తువులు సరఫరా బందు చేస్తామని అంటున్నారు. దీనిమూలంగా హాస్టల్లో మూసివేసే పరిస్థితి ఏర్పడింది. హాస్టల్ విద్యార్థులు ఆకలి కేకలతో మూసివేసే పరిస్థితి ఏర్పడింది. దాదావు రాష్ట్రంలోని మొత్తం బీసీ కాలేజీ హాస్టళ్ళు అద్దభవనాల్లో యున్నవి. 2సంత్సరాలుగా అద్దె చెల్లించడం లేదు. వీపరీత జాప్యం మూలంగా అద్దె యజమానులు భవనాలు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నారు. కావున వెంటనే అద్దె భవనాల బిల్లులు పాస్ చేయాలి. హాస్టళ్ళ కరెంట్ బిల్లులు గత 10 నెలలుగా పెండింగ్ లో యున్నవి. పరీక్ష సమయంలో హాస్టళ్ళుకు కరెంటు కట్ చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారు. పరీక్షలు ఎలా రాస్తారు. దీని ప్రభావం విద్యార్థుల పరీక్ష ఫలితాలపై యుంటుంది. రాష్ట్రంలో 295 బీసీ కాలేజీ హాస్టళ్లకు, 321 బీసీ గురుకుల పాఠశాలలకు ఒకదానికి కూడా సొంత భవనాలు లేవు.


**ఆందోళన హెచ్చరిక :** వారం రోజుల్లోగా బకాయిలు చెల్లించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అలాగే ఫైనాన్స్ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్లను, సచివాలయంను దిగ్బంధం చేస్తామని కృష్ణయ్య హెచ్చరించారు.

సూర్య
features@suryaa.com
కలర్స్
LIFE IS A RAINBOW
సూర్య
విజయవాడ
శుక్రవారం
24 మే 2024


# ఉమ్మడి రాజధానికి పదేళ్లు

- పూర్తికాని కార్పొరేషన్ల విభజన
- తెలంగాణ ఉద్యోగుల వెనక్కి ఎప్పుడు
- తెలంగాణ ప్రభుత్వం వేడుకలు
- నిరాశ నిస్పృహల్లో ఆంధ్ర ప్రదేశ్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం... ఏపీ, తెలంగాణగా విడిపోయి వచ్చే నెల రెండో తేదీకి పదేళ్లు అవుతుంది. కొత్తగా ఏర్పడిన రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు పొందింది. ఏపీ విభజిత భాగంగా మారింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా తెలంగాణ ఇచ్చిన దేవత సోనియాగాంధీని ఆహ్వానించి సత్కరించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఏపీలో ఆపద్ధర్మ ప్రభుత్వం ఉంది కాబట్టి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే మామూలుగానే జూన్ 2ను ప్రభుత్వాలు రాష్ట్ర అవతరణ దినోత్సవంగా చేయడం లేదు. కాబట్టి ఏపీ వైపు నుంచి జూన్ 2వ తేదీకి ఎలాంటి ప్రాధాన్యత ఉండదు.





### పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని

2014వ సంవత్సరం జూన్ 2వతేదీ నుంచి 10 సంవత్సరాల కాలానికి హైదరాబాద్ రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం హైదరాబాద్ ఈ ఏడాది జూన్ 2వతేదీ నుంచి తెలంగాణకు మాత్రమే రాజధానిగా ఉంటుంది. రెండు రాష్ట్రాలకు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అయినప్పటికీ, 2016వ సంవత్సరంలోనే అప్పటి ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ సచివాలయం, దాదాపు రాష్ట్ర పరిపాలన కార్యాలయాలను ఏపీలోని అమరావతికి మార్చారు. అమరావతిలో గ్రీన్‌ఫీల్డ్ ప్రపంచ స్థాయి రాజధానిని అభివృద్ధి చేయాలని అప్పటి సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారు.

### వేడుకల సంగతి సరే మరి సమస్యల మాటేమిటి ?

తెలుగు రాష్ట్రాల విభజన జరిగి జూన్ 2వతేదీకి పదేళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ అనేక సమస్యలు పరిష్కారం కాలేదు. హైదరాబాద్‌తో సహా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. రాష్ట్ర విభజన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఆస్తుల విభజన, విద్యుత్ బిల్లుల బకాయిలు వంటి అనేక సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తుది పరిష్కారం కోసం వేచి చూస్తున్న సమస్యల్లో ఉద్యోగుల బదిలీ అంశం ఇప్పటికీ తేలలేదు. ఏపీకి కేటాయించిన 144మంది తెలంగాణ ఉద్యోగులు ఇంకా అక్కడే పనిచేస్తున్నారు. వారు తమను తెలంగాణకు పంపాలని కోరుతున్నారు. అలాగే ప్రభుత్వ ఆధీనంలోని రోడ్డు రవాణా సంస్థ ఆస్తులపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు ఒక కొలిక్కి రాలేదు. రాజధాని నగరమైన హైదరాబాద్‌లో ఉన్న ఆర్టీసీ ఆస్తుల్లో వాటా కావాలని ఏపీ కోరిందని, దానికి టీఎస్ ఆర్టీసీ నిరాకరించింది. హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ ఆస్తులు తెలంగాణకు చెందినవేనని తెలంగాణ గడ్డపై ఉన్న ఆస్తుల్లో ఏపీకి వాటా ఎలా ఇస్తారని తెలంగాణ ప్రభుత్వం ప్రశ్నిస్తోంది. దశాబ్దం తరవాత కూ డా దాయాదుల మధ్య షెడ్యూల్ 9, 10 సం స్థల విభజన చిచ్చు రగులుతూనే ఉంది. ఈ పదేళ్ల కాలంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 32 సార్లు, రెండు రాష్ట్రాల అధికారులు అనేకసార్లు చర్చించినా ఫలితం శూన్యం! రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన ఎక్కడ తరువాయి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. చట్టంలోని షెడ్యూల్ 9 ప్రకారం మొత్తం 91 సంస్థలు, షెడ్యూల్ 10 లో 142 సంస్థల విభజన జరగాలి. వీటిలో షెడ్యూల్ 9 సంస్థల విభజనపై షీలా భిడే కమిటీ అధ్యయనం చేసి కొన్ని సిఫారసులు చేసింది. సంస్థ కేంద్ర కార్యాలయం ఆధారంగా ఆస్తుల విభజన జరగాలని ప్రతిపాదించింది. కేంద్ర కార్యాలయం అంటే కూడా స్పష్టమైన నిర్వచనం ఇచ్చింది. ఐతే, షీలా భిడే కమిటీ సిఫారసుల్లో 23 సంస్థల విభజనపై తెలంగాణా అభ్యంతరం తెలిపింది. అభ్యంతరం ఉన్న సంస్థలను వదిలేసి, ఏకాభిప్రాయం ఉన్న 68 సంస్థలతో ముందు విభజన ప్రక్రియ ప్రారంభించాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సూచించింది. తెలంగాణా ఒప్పుకున్నా అందుకు ఎపి ససేమిరా అంటోంది. ఈ పంచాయితీ నడుస్తుండగానే, ఆస్తుల పంపకాల కోసం ఒక మధ్యవర్తిని నియమించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఎపి దాఖలు చేసిన ఈ రిట్ పిటిషన్ పై తెలంగాణా, కేంద్ర హోంమంత్రిత్వ శాఖలు కౌంటర్ దాఖలు చేశాయి. ఆస్తుల విభజన కోసం ఆర్బిట్రేటర్ అక్కరలేదని వాదించాయి. ఇదిలా ఉంటే, షెడ్యూల్ 9 సంస్థల్లో అసలు కిరికిరి స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ది.

శ్షెష్ఠదీని విభజనకు భారత ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి అని 2014 పునర్విభజన చట్టంలో పేర్కొన్నారు. ఐతే, రాష్ట్ర విభజన సమయానికి ఎస్ఎఫ్‌సీ పాలకమండలిలో అత్యధిక మంది సభ్యులు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వాళ్లే ఉన్నారు. కానీ, చట్టంలోని సెక్షన్ 71 ప్రకారం సంస్థలో తెలంగాణాకు సమాన ప్రాతినిధ్యం కల్పించాల్సి ఉండింది. దాన్ని బేఖాతరు చేస్తూ సమాన ప్రాతినిధ్యం కల్పించక పోగా షీలా భిడే కమిటీ సిఫార్సులకు భిన్నంగా ఆ సంస్థ చరాస్తులు కూడా పంచాలని కార్పొరేషన్ మెంబర్లు తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి లేఖ పంపారు. ఇదే అంశాన్ని వివరిస్తూ ఆ తరవాత తెలంగాణా కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు హైదరాబాద్ నానక్ రాం గూడా, గాజులరామారం గ్రామంలో సుమారు 500 ఎకరాల ఆస్తి ఉంది. ఈ ఆస్తి విలువ సుమారు రూ.4 వేల కోట్లు ఉంటుంది. ఎస్ఎఫ్‌సీ బోర్డు తీర్మానంతో వేల కోట్ల ఆస్తి ఇరకాటంలో పడింది. ఆ ఆస్తుల పంపకం కుదరదని తెలంగాణా తేల్చి చెప్పింది. ఇక, షెడ్యూల్ 10 ఆస్తులు పంచాలని ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 2014లో ఎక్కడా లేదు. కానీ, ఈ సంస్థలకు సంబంధించిన నగదు మాత్రం రెండు రాష్ట్రాల పంచుకోవాలని చట్టంలో ఉంది. కానీ, ఆంధ్రప్రదేశ్ వ్యవహారశైలి ఇందుకు భిన్నంగా ఉంది. షెడ్యూల్ 10 సంస్థల ఆస్తులు కూడా పంచి తీరాల్సిందే అని పట్టుబడుతోంది. ఈ నేపథ్యంలో మొత్తం 142 సంస్థల ఆస్తులు ఎక్కడివి అక్కడే ఉండాలని నిర్ణయిస్తూ 2017 మే నెలలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆదేశాలు కూడా ఇచ్చింది. ఐనా, మొండి వైఖరి వీడకుండా ఆంధ్రప్రదేశ్ ఈ వ్యవహారంపై కోర్టు మెట్లు ఎక్కింది. విభజన చట్టానికి మేం కట్టుబడి ఉన్నాం అని ఇటు తెలంగాణా, చట్ట ప్రకారం షెడ్యూల్ 10 ఆస్తుల విభజన కుదరదని అటు ఎంహెచ్ఏ ఇరు పక్షాలూ కోర్టులో కౌంటర్ దాఖలు చేశాయి. విభజన జరిగి దశాబ్దం కావస్తున్నా రెండు రాష్ట్రాల మధ్య వివాదాస్పదంగా ఉన్న ఆస్తుల విభజన ఒక కొలిక్కి రావడం లేదు. అదెప్పటికి జరుగుతుందో అనే స్పష్టత కూడా లేదు.

### తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తెచ్చేదెపుడు?

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య తుది పరిష్కారం కోసం వేచి చూస్తున్న సమస్యల్లో ఉద్యోగుల బదిలీ అంశం ప్రధానమైంది. ఏపీకి కేటాయించిన 144మంది తెలంగాణ ఉద్యోగులను వెనక్కి తీసుకురావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతూ మే 18వ తేదీన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందించామని తెలంగాణ నాన్గెజిటెడ్ అధికారుల సంఘం సెంట్రల్ ప్రతినిధులు చెప్పారు. రాష్ట్ర విభజన తర్వాత 144 మంది తెలంగాణ ఉద్యోగులు 2014 నుంచి ఏపీలో పనిచేస్తున్నారు.

### పూర్తి కాని కార్పొరేషన్ల విభజన

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 ప్రకారం హైదరాబాద్ రాజధాని నగరం పూర్తిగా తెలంగాణకు చెందుతుంది. అధికారిక వర్గాల ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య చట్టంలోని షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో జాబితా చేసిన వివిధ సంస్థలు, కార్పొరేషన్ల విభజన, అనేక అంశాలపై ఇంకా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఇంకా పూర్తి కాలేదు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం 89 ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లు తొమ్మిదో షెడ్యూల్లో జాబితా చేశారు. వాటిలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆగ్రో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ వంటి ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కంపెనీలు, కార్పొరేషన్లు ఉన్నాయి.

### 10 షెడ్యూల్ సంస్థల విభజన ఏది?


చట్టంలోని 10వ షెడ్యూల్లో ఏపీ స్టేట్ కో-ఆపరేటివ్ యూనియన్, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఏపీ ఫారెస్ట్ అకాడమీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ,ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ వంటి 107 శిక్షణా సంస్థలు ఉన్నాయి. రిటైర్డ్ బ్యూరోక్రాట్ షీలా భిడే నేతృత్వంలోని నిపుణుల కమిటీ షెడ్యూల్ 9,10 షెడ్యూల్ సంస్థల విభజనపై సిఫార్సులు చేసినప్పటికీ, ఈ అంశం అపరిష్కృతంగానే ఉంది. విభజన తర్వాత విద్యుత్ సరఫరాకు సంబంధించి బకాయిల చెల్లింపు విషయంలో కూడా రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరలేదు.



## హైదరాబాద్ ఆర్టీసీ ఆస్తులపై వివాదం



ప్రభుత్వ ఆధీనంలోని రోడ్డు రవాణా సంస్థ ఆస్తులపై రెండు రాష్ట్రాల మధ్య విభేదాలు ఒక కొలిక్కి రాలేదు. రాజధాని నగరమైన హైదరాబాద్లో ఉన్న ఆర్టీసీ ఆస్తుల్లో వాటా కావాలని ఏపీ కోరిందని, దానికి టీఎస్ఆర్టీసీ నిరాకరించింది. షీలా భిడే ప్యానెల్ ఇచ్చిన హెడ్ క్వార్టర్స్ నిర్వచనం ప్రకారం ఆర్టీసీ ఆస్తులు తమకు చెందినవని పేరు చెప్పడానికి ఇష్టపడని టీఎస్ ఆర్టీసీ అధికారి ఒకరు చెప్పారు. హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ ఆస్తులు తెలంగాణకు చెందినవేనని చొప్పదండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఫెడరల్ తెలంగాణకు చెప్పారు. తెలంగాణ గడ్డపై ఉన్న ఆస్తుల్లో ఏపీకి వాటా ఎలా ఇస్తామని ఆయన ప్రశ్నించారు. కాగా ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి చేసిన ఆర్టీసీ ఆస్తుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన చట్టం ప్రకారం వాటా ఇవ్వాల్సిందే!




### పదేళ్లు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని

2014వ సంవత్సరం జూన్ 2వతేదీ నుంచి 10 సంవత్సరాల కాలానికి హైదరాబాద్ రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా చేశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం హైదరాబాద్ ఈ ఏడాది జూన్ 2వతేదీ నుంచి తెలంగాణకు మాత్రమే రాజధానిగా ఉంటుంది. రెండు రాష్ట్రాలకు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అయినప్పటికీ, 2016వ సంవత్సరంలోనే అప్పటి ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ సచివాలయం, దాదాపు రాష్ట్ర పరిపాలన కార్యాలయాలను ఏపీలోని అమరావతికి మార్చారు. అమరావతిలో గ్రీన్‌ఫీల్డ్ ప్రపంచ స్థాయి రాజధానిని అభివృద్ధి చేయాలని అప్పటి సీఎం చంద్రబాబు ప్రణాళిక రూపొందించారు.

### ఏపీ నుంచి లేక్ వ్యూ గెస్ట్ హౌస్ స్వాధీనం చేసుకోవాలని సీఎం ఆదేశం

రాష్ట్ర విభజన సమస్యలపై మే 15వతేదీన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ఇచ్చిన హైదరాబాద్‌లోని లేక్‌వ్యూ ప్రభుత్వ అతిథి గృహం వంటి భవనాలను జూన్ 2వతేదీ తర్వాత స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంతడ్డి అధికారులకు సూచించారు. ఈ ఏడాది మార్చి నెలలో కేంద్రం రెండు రాష్ట్రాలకు భూ కేటాయింపులు చేయడంతో ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌పై వివాదం సద్దుమణిగింది.

### పెండింగ్ సమస్యలు పరిష్కరించండి: సీఎం రేవంత్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగుల బదిలీలు, వారిని సొంత రాష్ట్రానికి తీసుకువచ్చే ప్రక్రియను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అధికారులను తాజాగా ఆదేశించారు. రెండు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదిరిన సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాల్లో తెలంగాణ ప్రయోజనాలను కాపాడే విధంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్‌ల మధ్య పెండింగ్‌లో ఉన్న అంశాలు, ఇతర సంబంధిత అంశాలపై చర్చించేందుకు మే 18వతేదీన రాష్ట్ర మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించినా ఈసీ ఆంక్షల వల్ల దీనిపై చర్చించలేదు.

తెలంగాణ ఆవిర్భవించి పదేళ్లు గడిచిన నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాలు సామరస్య పూర్వకంగా చర్చించుకొని విభజన వివాదాలను పరిష్కరించుకోవాలి అయితే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజన వివాదాలు ఇప్పటికైనా పరిష్కారమవుతాయా? లేదా? అనేది వేచిచూడాల్సిందే.

విద్య వెంకట్, తెలంగాణ బ్యూరో 9391618181.



# తెలివితో బౌలింగ్ చేసే ప్లేయర్లు కావాలి

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కప్ కల మరోసారి చెదిరింది. ఐపీఎల్-2024 సీజన్ను కూడా టైటిల్ సాధించకుండానే ముగించింది. అహ్మదాబాద్ వేదికగా రాజస్థాన్ రాయల్స్తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్లో నాలుగు వికెట్ల తేడాతో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే ఈ సీజన్లో ఆర్సీబీకి కొన్ని సానుకూలాంశాలు కనిపించాయి. ఈ సీజన్ ప్రారంభంలో తొలి ఎనిమిది మ్యాచ్లో ఆర్సీబీ కేవలం ఒకే విజయం సాధించింది. ఆ స్థితిలో బెంగళూరు ప్లేఆఫ్స్కు చేరుతుందని దాదాపు ఎవరూ ఊహించి ఉండరు. కానీ ఆ తర్వాత డుప్లెసిస్ సేన గొప్పగా పుంజుకుంది. వరుసగా ఆరు విజయాలు సాధించింది. డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ను సైతం మట్టికరిపించి ప్లేఆఫ్స్కు చేరింది. కానీ ఎలిమినేటర్లో అదే జోరు ప్రదర్శించలేకపోయింది. రాజస్థాన్ చేతిలో ఓడి ఓటమి బాధతో ఆర్సీబీ మైదానాన్ని వీడింది. కాగా, ఆర్సీబీ కోచ్ ఆండీ ఫ్లవర్ జట్టు గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. కొందరు ఆటగాళ్లను విడిచిపెడుతున్నామని పరోక్షంగా వ్యాఖ్యలు చేశాడు. తమ సొంతమైదానం అయిన చిన్నస్వామి స్టేడియంలో సత్తాచాటాలంటే పేస్ను వేస్తే బౌలర్ల కంటే భిన్నమైన బంతులను సంధించే నైపుణ్యం ఉన్న బౌలర్లు కావాలని అన్నాడు. తెలివితో బౌలింగ్ చేసే ప్లేయర్లు కావాలని పేర్కొన్నాడు. రూ.11.50 కోట్ల భారీ ధర చెల్లించి సొంతం చేసుకున్న అల్జారీ జోసెఫ్ను రిటైన్ చేసుకోవట్లదని ఆండీ ఫ్లవర్ హింట్ ఇచ్చాడు. కొత్త బంతితో, అతివేగంతో బంతులు సంధిస్తాడనే ఉద్దేశంతో జోసెఫ్కు భారీ ధర వెచ్చించారు. కానీ చిన్నస్వామి స్టేడియంలో జోసెఫ్ ధారళంగా పరుగులు సమర్పించుకున్నాడు. కాగా, పవర్ హిట్టర్లను జట్టులో కొనసాగించాలనుకుంటున్నామని తెలిపాడు.



## క్వాలిఫయర్-2కు
# వర్షం ముప్పు
### మ్యాచ్ రద్దయితే...?

ఐపీఎల్ 2024 సీజన్ తుది దశకు చేరింది. మరో రెండు మ్యాచ్లతో ఈ టోర్నీకి తెరపడనుంది. ఇప్పటికే క్వాలిఫయర్-1లో సన్రైజర్స్ హైదరాబాద్ను ఓడించిన కోల్కతా నైట్రైడర్స్(కేకేఆర్) ఫైనల్ చేరగా.. ఎలిమినేటర్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)ని ఓడించిన రాజస్థాన్ రాయల్స్.. క్వాలిఫయర్-2కు సిద్దమైంది. క్వాలిఫయర్-1లో ఓడిన సన్రైజర్స్ హైదరాబాద్తో చెన్నై వేదికగా శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో రాజస్థాన్ రాయల్స్ అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్లో గెలిచిన జట్టు ఆదివారం ఇదే వేదికగా జరిగే ఫైనల్లో కేకేఆర్తో తలపడనుంది.

**చెన్నైలో భారీ వర్షాలు..**

అయితే క్వాలిఫయర్-2 మ్యాచ్కు వర్షం ముప్పు పొంచి ఉంది. ప్రస్తుతం తమిళనాడులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. చెన్నై నగరంతో పాటు 7 జిల్లాలకు వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. 48 గంటల పాటు(మే 23, 24) భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించింది. నైరుతి బంగాళఖాతంలో అల్పపీడనం ఏర్పడునున్నట్లు కూడా వాతావరణ శాఖ పేర్కొంది. 48 గంటల్లో ఇది వాయుగుండగా మారుతుందని పేర్కొంది. దీని ప్రభావంతోనే భారీ వర్షాలు కురుస్తాయని చెప్పింది. చెన్నై వేదికగానే క్వాలిఫయర్-2తో పాటు ఫైనల్ జరగాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్లకు వర్షం ముప్పు పొంచి ఉంది.

**వర్షంతో మ్యాచ్ రద్దయితే..**

సన్రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2 మ్యాచ్కు వర్షం అంతరాయం కలిగిస్తే రిజర్వ్ అయిన మరుసటి రోజు ఆటను కొనసాగిస్తారు. క్వాలిఫయర్-2తో పాటు ఫైనల్కు కూడా రిజర్వ్ డేను కేటాయించారు. ఒకవేళ రిజర్వ్ డే కూడా మ్యాచ్ జరగకపోతే.. పాయింట్స్ టేబుల్లో టాప్లో ఉన్న జట్టు ఫైనల్ చేరుతుంది. ఈ లెక్కన సన్రైజర్స్ హైదరాబాద్.. కేకేఆర్తో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. ఒక వేళ ఫైనల్ మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దయితే.. రిజర్వ్ డే కూడా సాధ్యం కాకపోతే టేబుల్ టాపర్ అయిన కేకేఆర్ను విజేతగా ప్రకటిస్తారు. అయితే ఐపీఎల్ చరిత్రలో ఏ సీజన్ ఫైనల్ మ్యాచ్ కూడా వర్షం కారణంగా రద్దవ్వాలి. గతేడాది అహ్మదాబాద్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్కు వర్షం అంతరాయం కలిగించింది. దాంతో రిజర్వ్ డే మ్యాచ్ కొనసాగించారు. ఈ మ్యాచ్లో సీఎస్కే విజయం సాధించి ఐదో టైటిల్ను సొంతం చేసుకుంది.

# రాజస్థాన్లో వ్యూహాత్మక మార్పు



ఐపీఎల్ 2024 సీజన్లో రాజస్థాన్ రాయల్స్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా శుక్రవారం జరగనున్న క్వాలిఫయర్-2 మ్యాచ్లో సన్రైజర్స్ హైదరాబాద్తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్లో గెలిచిన జట్టే ఆదివారం చెన్నై వేదికగానే జరిగే ఫైనల్లో కోల్కతా నైట్రైడర్స్(కేకేఆర్)తో తలపడనుంది. దాంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా సిద్ధమవుతున్నాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో బుధవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్లో సమష్టిగా రాణించి విజయం సాధించిన రాజస్థాన్ రాయల్స్ రెట్టించిన ఆత్మవిశ్వాసంతో ఉంది. అదే జోరులో సన్రైజర్స్ హైదరాబాద్ను ఓడించి ఫైనల్కు చేరాలనుకుంటోంది.

**సస్పెన్స్ థ్రిల్లర్ :** మరోవైపు క్వాలిఫయర్-1లో కేకేఆర్ చేతిలో ఓడిన సన్రైజర్స్ మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. ఈ నెలలోనే ఇరు జట్ల మధ్య జరిగిన లీగ్ మ్యాచ్లో సన్రైజర్స్ హైదరాబాద్ ఒక్క పరుగుతో గెలిచింది. ఆఖరి బంతికి రెండు పరుగులు చేయాల్సిన పరిస్థితుల్లో భువీ బౌలింగ్లో రోవ్మన్ పోవెల్ వికెట్ల ముందు దొరికిపోవడంతో సన్రైజర్స్ గెలుపొందింది. మరోసారి ఇరు జట్ల మధ్య అదే తరహా మ్యాచ్ను అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే చెపాక్ మైదానం స్లో వికెట్ కావడం.. స్పిన్నర్లకు అనుకూలంగా ఉండనున్న నేపథ్యంలో రాజస్థాన్ రాయల్స్ వ్యూహాత్మక మార్పు చేసే అవకాశం ఉంది.

**వ్యూహాత్మక మార్పు :** ఎక్స్ట్రా స్పిన్నర్ కేశవ్ మహరాజ్ను ఆడించే ఛాన్స్ ఉంది. ముందుగా బౌలింగ్ చేస్తే మాత్రం ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగుతోంది.

బ్యాటింగ్ చేస్తే మాత్రం ముగ్గురు ఓవర్సీస్ ఆటగాళ్లతో బరిలోకి దిగి పరిస్థితులకు తగ్గట్లు రోవ్మన్ పోవెల్ లేదా కేశవ్ మహారాజ్లను ఇంపాక్ట్ ప్లేయర్గా ఆడించనుంది. ఈ ఒక్కటి మినహా తుది జట్టులో ఎలాంటి మార్పు చేసే అవకాశం లేదు. ఓపెనర్లుగా యశస్వి జైస్వాల్, టామ్ కోహ్లర్ ఆడనుండగా.. మిడిలార్డర్లో సంజూ శాంసన్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, షిమ్రన్ హెట్మైర్ బరిలోకి దిగనున్నారు. రోవ్మన్ పోవెల్, కేశవ్ మహరాజ్లో ఒకరికి చోటు దక్కనుంది. అశ్విన్, చాహల్ స్పిన్ బాధ్యతలు పంచుకోనుండగా.. ట్రెంట్ బౌల్ట్, ఆవేశ్ ఖాన్, సందీప్ శర్మ పేస్ బౌలింగ్ను లీడ్ చేయనున్నారు.



# ఆర్సీబీ ఓటమి..
## కన్నీటిని ఆపుకుంటూ డివిలియర్స్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 17 ఏళ్ల ట్రోఫీ నిరీక్షణ కొనసాగుతూనే ఉంది. ఐపీఎల్-2024 సీజన్ను కూడా ఆర్సీబీ టైటిల్ను అందుకోకుండానే ముగించింది. ఓ దశలో తొలి ఎనిమిది మ్యాచ్లో కేవలం ఒకే విజయం సాధించిన బెంగళూరు ఆ తర్వాత అద్భుతంగా పుంజుకుంది. వరుసగా ఆరు విజయాలు సాధించి ప్లేఆఫ్స్కు అర్హత సాధించింది. కానీ రాజస్థాన్ రాయల్స్తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో 17 ఏళ్ల కప్ కల మరోసారి కలగానే మిగిలిపోయింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 172 పరుగులు చేసింది. రజత్ పటిదార్ (34; 22 బంతుల్లో, 24, 26), విరాట్ కోహ్లి (33; 24 బంతుల్లో, 34, 16), మహిపాల్ లోమ్రర్ (32; 17 బంతుల్లో, 24, 26) పరుగులు చేశారు. రాజస్థాన్ బౌలర్లలో అవేశ్ ఖాన్ (3/44) మూడు, అశ్విన్ (2/19) రెండు వికెట్లు తీశారు. అనంతరం రాజస్థాన్ రాయల్స్ 19 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. యశస్వీ జైస్వాల్ (45; 30 బంతుల్లో, 84), రియాన్ పరాగ్ (36; 26 బంతుల్లో, 24, 26), హెట్మేయిర్ (26; 14 బంతుల్లో, 34, 16) విజయంలో కీలక పాత్ర పోషించారు. సిరాజ్ (2/33) రెండు వికెట్లు తీశాడు.



11: ఐపీఎల్-2024లో మెగా పోరుకు సమయం ఆసన్నమైంది. ఫైనల్ బెర్తు కోసం క్వాలిఫయిర్-2లో సన్రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ తలపడనున్నాయి. శుక్రవారం చెన్నైలోని చెపాక్ వేదికగా ఈ హోరాహోరీ పోరు జరగనుంది. ఈ మ్యాచ్లో విజయం సాధించిన జట్టు చెపాక్ వేదికగానే

# వాషింగ్టన్ సుందర్ జట్టులోకి ఎంట్రీ?

ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో కోల్కతా నైట్ రైడర్స్తో పోటీపడుతుంది. ఈ సీజన్లో అదిరే విజయాలు, రికార్డు స్కోరులతో రెండో స్థానంలో నిలిచిన సన్రైజర్స్ క్వాలిఫయిర్-1లో చుక్కెదురైంది. కేకేఆర్ చేతిలో ఓడింది. ఈ పరాజయంతో కొన్ని పాఠాలు నేర్చుకున్న ఎస్ఆర్హెచ్ బలమైన రాజస్థాన్ను ఢీ కొననుంది.

అయితే బౌలింగ్కు అనుకూలించే చెపాక్లో రాజస్థాన్ను ఓడించడం హైదరాబాద్కు అంత తేలిక కాదు. రాజస్థాన్ జట్టులో రవిచంద్రన్ అశ్విన్, చాహల్, బౌల్ట్ క్వాలిటీ బౌలర్లు ఉన్నారు. మరోవైపు సన్రైజర్స్ జట్టులో అనుభవజ్ఞ స్పిన్నర్లు ఎవరూ లేరు. దీంతో చెపాక్ పిచ్ గురించి అనుభవం ఉన్న వాషింగ్టన్ సుందర్ను జట్టులోకి తీసుకురావాలని ఎస్ఆర్హెచ్ భావిస్తోంది. సుందర్ చెన్నైకి చెందని వ్యక్తి . అంతేగాక యశస్వీ జైస్వాల్ను కట్టడి చేయడానికి ఈ ఆఫ్ స్పిన్నర్ పవర్ప్లేలో ఉపయోగపడతాడు. షాబాజ్ అహ్మద్ స్థానంలో సుందర్ను ఎంపిక చేయాలని సన్రైజర్స్ చూస్తోంది.అయితే కేకేఆర్తో జరిగిన క్వాలిఫయిర్-1లో విధ్వంసకర ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఆదిలోనే పెవిలియన్కు చేరారు. అనంతరం కీలక భాగస్వామ్యాలు నెలకొల్పే అనుభవజ్ఞుడు లేకపోవడంతో సన్రైజర్స్ తక్కువ స్కోరుకే పరిమితమైంది. ఇలాంటి పరిస్థితి మరోసారి తలెత్తకుండా స్టార్ ప్లేయర్ మార్క్రమ్ను తిరిగి జట్టులోకి తీసుకురావాలని సన్రైజర్స్ మేనేజ్మెంట్ చూస్తోంది. ఇక బౌలింగ్ విషయానికొస్తే.. విజయ్కాంత్ వియస్కాంత్ స్థానంలో జయదేవ్ ఉనద్కత్కు అవకాశం ఇవ్వాలని భావిస్తోంది. కాగా, ఐపీఎల్లో ఇరు జట్లు 19 మ్యాచ్లు ఆడగా, సన్రైజర్స్ పదింట్లో, రాజస్థాన్ రాయల్స్ తొమ్మిది మ్యాచ్లో గెలిచింది. ఈ సీజన్లో జరిగిన మ్యాచ్లో రాజస్థాన్పై ఎస్ఆర్హెచ్దే పైచేయి. ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన ఈ పోరులో ఒక్క పరుగు తేడాతో నెగ్గింది.

# క్వాలీఫయర్ 2లో సన్రైజర్స్ హైదరాబాద్ గెలవాలంటే?

ఐపీఎల్ 2024 సీజన్లో సన్రైజర్స్ హైదరాబాద్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. చెన్నైలోని చెపాక్ మైదానం వేదికగా రాజస్తాన్ రాయల్స్తో జరిగే క్వాలిఫయర్-2లో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్లో గెలిచిన జట్టే ఆదివారం కోల్కతా నైట్రైడర్స్(కేకేఆర్)తో ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. దాంతో ఇరు జట్లు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాయి. ఓవైపు కేకేఆర్తో క్వాలిఫయర్-1లో సన్రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలవ్వగా.. మరోవైపు రాజస్థాన్ రాయల్స్.. ఎలిమినేటర్ మ్యాచ్లో ఆర్సీబీని ఓడించి రెట్టించిన ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. అంతేకాకుండా స్పిన్కు అనుకూలంగా ఉండే చెపాక్ మైదానానికి తగ్గట్లుగా రాజస్థాన్ రాయల్స్లో అద్భుత స్పిన్నర్లు ఉన్నారు. లోకల్ భాయ్ అశ్విన్తో పాటు యుజ్వేంద్ర చాహల్ను ఎదుర్కోవడం సన్రైజర్స్ హైదరాబాద్కు బిగ్ ఛాలెంజ్.




**ట్రావిషేక్ పైనే భారం :**

ఈ మ్యాచ్లో విజయం సాధించాలంటే సన్రైజర్స్ హైదరాబాద్ స్థాయికి మించిన ప్రదర్శన చేయాలి. ముఖ్యంగా ఆ జట్టు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సత్తా చాటడం కీలకం. సన్రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లలో ఈ ఇద్దరే కీలక పాత్ర పోషించారు. విధ్వంసకర బ్యాటింగ్తో రికార్డ్ విజయాలు అందించారు. సన్రైజర్స్ హైదరాబాద్ తరఫున ట్రావిస్ హెడ్(533, అభిషేక్ శర్మలే(470) టాప్ స్కోరర్లుగా కొనసాగుతున్నారు. చాహల్, బౌల్ట్, అశ్విన్ వంటి ప్రమాదకర బౌలర్లను ఎదుర్కొని భారీ స్కోర్ చేయాలంటే ఈ ఓపెనింగ్ జోడీ రాణించాల్సిందే. ఈ ఇద్దరితో పాటు హెన్రిచ్ క్లాసెన్(413) సత్తా చాటితే సన్రైజర్స్కు తిరుగు ఉండదు. రాహుల్ త్రిపాఠి, నితీష్ కుమార్ రెడ్డిలు తమ జోరును కొనసాగించాల్సి ఉంది. నితీష్ కుమార్ రెడ్డి రాజస్థాన్ రాయల్స్తో జరిగిన మ్యాచ్లో 76 పరుగులతో సత్తా చాటాడు. మరోసారి అతను అదే తరహా ప్రదర్శన కొనసాగిస్తే సన్రైజర్స్ బ్యాటింగ్కు తిరుగుండదు.

**బౌలింగ్లోనూ:** సన్రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్లో ప్యాట్ కమిన్స్, భువనేశ్వర్ కుమార్, నటరాజన్ రాణిస్తున్నా ఇతర బౌలర్లను నుంచి సహకారం లభించడం లేదు. వానిందు హసరంగా స్థానంలో జట్టులోకి వచ్చిన విజయకాంత్ వియాస్కంత్ అంచనాలను అందుకోలేకపోతున్నాడు. అతని స్థానంలో గ్లేన్ ఫిలిప్స్ను తీసుకోవడం ఉత్తమం. సన్వీర్ సింగ్కు బదులు జయదేవ్ ఉనాద్కత్ను ఆడిస్తే బౌలింగ్తో పాటు బ్యాటింగ్ బలం పెరుగుతోంది. పవర్ ప్లేలోనే రాజస్థాన్ రాయల్స్ డేంజరస్ బ్యాటర్లు యశస్వి జైస్వాల్, సంజూ శాంసన్లను ఔట్ చేస్తే మ్యాచ్పై పట్టు చిక్కుతుంది. ఈ మ్యాచ్కు వర్షం ముప్పు ఉన్న నేపథ్యంలో పకడ్బందీ ప్రణాళికలతో బరిలోకి దిగడం చాలా ముఖ్యం.

# పడి లేచిన కెరటం..
## బెస్ట్ ఫ్రెండ్ దారుణ మోసం!



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) వెటరన్ వికెట్ కీపర్ దినేశ్ కార్తీక్ ఐపీఎల్కు వీడ్కోలు పలికాడు. ఐపీఎల్ 2024 సీజన్లో భాగంగా రాజస్థాన్ రాయల్స్తో బుధవారం జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్తో రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు. ఈ సీజన్ ముందే తన నిర్ణయాన్ని వెల్లడించిన దినేశ్ కార్తీక్.. ఐపీఎల్లో ఆర్సీబీతో పాటు కేకేఆర్, ముంబై ఇండియన్స్, గుజరాత్ లయన్స్ జట్లకు ప్రాతినిథ్యం వహించాడు. మొత్తం 257 ఐపీఎల్ మ్యాచ్లు ఆడిన దినేశ్ కార్తీక్ 26.32 సగటు, 135 స్ట్రైక్రేటుతో 4,842 పరుగులు చేశాడు. ఇందులో 22 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆర్సీబీ తరఫున 162 స్ట్రైక్రేటుతో 937 పరుగులు చేశాడు. ఫినిషర్గా సత్తా చాటిన డీకే 82 ఫోర్లు, 53 సిక్సర్లు సాధించాడు. **డీకే జీవితం స్ఫూర్తి దాయకం :** ఇక దినేశ్ కార్తీక్ జీవితం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తి దాయకం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. దినేశ్ కార్తీక్ రీఎంట్రి ఇచ్చినట్లు ప్రపంచంలో మరే క్రికెటర్ కూడా కమ్ బ్యాక్ ఇవ్వలేదు. ధోనీ రాకతో టీమిండియా అవకాశాలు సన్నగిల్లగా.. వ్యక్తిగత జీవితంలో కట్టుకున్న భార్య, ప్రాణ స్నేహితుడు దారుణంగా మోసం చేశారు. దాంతో అతను పిచ్చోడిలా మారిపోయాడు. అయితే దీపిక్ పల్లికల్ అందించిన ప్రేమ అతన్న బౌన్స్ బ్యాక్ అయ్యేలా చేసింది. దినేశ్ కార్తీక్ టీమిండియా సెకండ్ వికెట్ కీపర్గా తమిళనాడు కెప్టెన్గా అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న టైమ్లో అతని టీమ్మేట్ మురళీ విజయ్.. కార్తీక్ మొదటి భార్యతో ఎఫైర్ పెట్టుకున్నాడు. **ప్రాణ స్నేహితుడి మోసం :** ఈ విషయం కార్తీక్కు తప్పా తమిళనాడు టీమ్ మొత్తానికి తెలుసు. ఒకరోజు అతని మొదటి భార్య ఈ విషయాన్ని కార్తీక్కు తెలియజేసింది. మురళీ విజయ్ కారణంగా గర్భం దాల్చినట్లు చెప్పి విడాకులు ఇవ్వాలని కోరింది. విడాకులు తీసుకున్న ఆమె మురళీ విజయ్తో సహజీవనం మొదలుపెట్టింది. ఆ టైమ్లో విజయ్.. సీఎస్కే, టీమిండియా ఓపెనర్గా రాణిస్తున్నాడు. ఈ ఊహించని పరిణామంతో దినేశ్ కార్తీక్ డిప్రెషన్కు లోనయ్యాడు. అతని ప్రదర్శన కూడా దెబ్బతిన్నది. టీమిండియాలో చోటుతో పాటు తమిళనాడు కెప్టెన్సీ బాధ్యతలను కోల్పోయాడు. ఐపీఎల్లోనూ దారుణంగా విఫలమయ్యాడు. ఈ బాధలను భరించలేక ఆత్మహత్యాయత్నం చేశాడు. జిమ్కు వెళ్లడం మానేసాడు.

**పల్లికల్ పరిచయంతో :** ఈ విషయం తెలుసుకున్న దినేశ్ కార్తీక్ ట్రైనర్.. అతని ఇంటికెళ్లి వ్యక్తిగతంగా కలిసాడు. జీవితంపై ఆశలు పెంచి మళ్లీ ట్రైనింగ్ మొదలుపెట్టేలా చేసాడు. ట్రైనర్ సూచనలతో మళ్లీ జిమ్ చేయడం మొదలుపెట్టిన దినేశ్ కార్తీక్కు అక్కడే ట్రైనింగ్ తీసుకుంటున్న భారత స్క్వాష్ ప్లేయర్ దీపికా పల్లికల్ పరిచయమైంది. దినేశ్ కార్తీక్ కథను తెలుసుకొని పల్లికల్ చలించిపోయింది. ట్రైనర్తో కలిసి అతనికి కౌన్సిలింగ్ ఇవ్వడం మొదలుపెట్టింది. పల్లికల్ పరిచయం కార్తీక్ జీవితానికి ఊపిరి అయింది. దినేశ్ కార్తీక్ను దీపికా ఎంకరేజ్ చేయడంతో నెట్స్లో తీవ్రంగా శ్రమించిన అతను.. డొమెస్టిక్ మ్యాచ్లో సత్తా చాటాడు. భారత జట్టుకు ఎంపికవ్వడంతో పాటు కేకేఆర్ కెప్టెన్సీ అందుకున్నాడు.

**కవల పిల్లలతో :** దీపికా పల్లికల్ను పెళ్లి చేసుకున్న కొన్నాళ్లకు టీమిండియాలో అతని స్థానాన్ని రిషభ్ పంత్ భర్తీ చేసాడు. మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. 34 ఏళ్ల వయసులో అతని కెరీర్ చివరి దశకు చేరిందని భావించిన కార్తీక్.. కేకేఆర్ కెప్టెన్సీ వదిలేసాడు. రిటైర్మెంట్ ప్రకటించి కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడాలనుకున్నాడు. కానీ పల్లికల్ అప్పటికే గర్భవతి. మధ్యలో కామెంటేటర్గా అవతారమెత్తాడు. ఈ జంటకు కవల పిల్లలు జన్మించారు. దినేశ్ కార్తీక్కు సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథ్ నుంచి కాల్ వచ్చింది. ధోనీ వారసుడిగా తీసుకోవాలనుకుంటున్నామని ఆయన కార్తీక్కు తెలిపాడు. అయితే వేలంలో అనూహ్యంగా చెన్నైతో పోటీపడ్డ ఆర్సీబీ కార్తీక్ను సొంతం చేసుకుంది. ఐపీఎల్ 2022 సీజన్లో కార్తీక్ అసాధారణ ప్రదర్శన కనబర్చాడు. ఫినిషర్గా కార్తీక్ 2.ను తలపించాడు. ఈ ప్రదర్శనతో టీమిండియాలోకి రీఎంట్రి ఇచ్చిన టీ20 ప్రపంచకప్ 2022 ఆడాడు. గత సీజన్లో కార్తీక్ విఫలమైనా ఈ సీజన్లో సత్తా చాటాడు.

# ఫాఫ్ డుప్లెసిస్, ఆండీ ఫ్లవర్ సేవలు ముగిసినట్లేనా?



ఐపీఎల్ 2024 సీజన్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అసాధారణ పోరాటం ముగిసింది. ఈ సారి కూడా అభిమానులకు కన్నీళ్లనే మిగిల్చింది. ఆశలు లేని స్థితి నుంచి అద్భుతమైన ప్రదర్శనతో ప్లే ఆఫ్స్లో అడుగు పెట్టిన ఆర్సీబీ.. కీలక ఎలిమినేటర్ మ్యాచ్లో మాత్రం చేతులెత్తేసింది. బుధవారం ఎలిమినేటర్లో ఆ జట్టు 4 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓటమిపాలైంది. వచ్చే ఏడాది మెగా వేలం జరగనున్న నేపథ్యంలో ఆర్సీబీ టీమ్ పూర్తిగా మారే అవకాశం ఉంది. గరిష్టంగా నలుగురి ఆటగాళ్లకు మాత్రమే అవకాశం ఉండనుండటంతో కీలక ఆటగాళ్లందరూ జట్టుకు దూరం కానున్నారు. 40 ఏళ్లకు చేరిన కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ను రిటైన్ చేసుకోవడం కూడా సందేహమే. హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్ను కూడా మార్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫాఫ్ డుప్లెసిస్, ఆండీ ఫ్లవర్ సేవలు ముగిసినట్లేనని సోషల్ మీడియా వేదికగా పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి ఈ సీజన్కు ముందే ఆండీ ఫ్లవర్ను ఆర్సీబీ తమ హెడ్ కోచ్గా నియమించుకుంది. సుదీర్ఘ కాలం కోచ్గా పని చేసిన మైక్ హెస్సెన్ను కాదని ఆండీ ఫ్లవర్ను తీసుకుంది. అతని పర్యవేక్షణలో ఆర్సీబీ ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయింది.

సెకండాఫ్ టోర్నీలో సంచలన విజయాలు సాధించినా.. కీలక పోరులో చేతులెత్తేయడంతో ఆర్సీబీ మేనేజ్మెంట్ కొత్త కోచ్ వేటలో పడినట్లు తెలుస్తోంది. కేకేఆర్ తరహాలో స్వదేశీ కోచ్ను నియమించుకోవాలనే పట్టుదలతో ఆర్సీబీ ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఫాఫ్ డుప్లెసిస్ వయసు దృష్ట్యా అతన్ని ఒక్క, రెండు సీజన్ల కోసం రిటైన్ చేసుకొని రిస్క్ చేయలేదు. ఈ క్రమంలోనే ఫాఫ్ డుప్లెసిస్ను కూడా వదులుకునే అవకాశం ఉంది. విరాట్ కోహ్లీ, రజత్ పటీదార్, కామెరూన్ గ్రీన్ మినహా అందర్నీ వేలంలోకి వదిలేసే అవకాశం ఉంది.

# సూర్య సినిమా



ఇటీవలే పుష్ప పుష్ప పుష్ప రాజ్ అంటూ తొలి లిరికల్ సాంగ్‌తో ప్రపంచ వ్యాప్త శ్రోతలను అలరించి.. యూట్యూబ్ వ్యూస్‌లో ఆల్ టైమ్ రికార్డులు నెలకొల్పిన పుష్ప–2 ది రూల్‌లోని పుష్పరాజ్ టైటిల్ సాంగ్ ఇంకా అంతటా మారుమోగుతూనే వుంది.. ఇప్పుడు తాజాగా మరో లిరికల్ అప్‌డేట్‌ను ఇచ్చారు పుష్ప–2 మేకర్స్.. ఈ సారి చిత్రంలోని హీరోయిన్ శ్రీవల్లి వంతు వచ్చింది. పుష్ప రాజ్ జోడి అయిన శ్రీవల్లి పుష్ప రాజ్‌తో కలిసి పాడుకున్న మెలోడి సాంగ్‌ను కపుల్ సాంగ్‌గా నెల 29న ఉదయం 11:07

## 29న పుష్ప -2 రెండో లిరికల్

నిమిషాలకు విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను నేడు విడుదల చేశారు మేకర్స్. ప్రోమోలో కేశవ వాయిస్‌తో సెకండ్ సాంగ్ గురించి రష్మికను అడుగుతాడు .మేకప్ వేసుకునేందుకు సిద్ధంగా వున్న శ్రీవల్లి సూసేకి అగ్గిరవ్వ మాదిరి వుంటాడే నా సామీలివుంటాడే నా సామి అంటూ ఆమె పాడుతూ ఐకానిక్ స్టెప్పుతో అలరించింది. ఈ ప్రోమో చూసి సాంగ్ అదిరిపోయే మెలోడీలా వుండబోతుందని అందరూ అంచనా వేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు ఎదురుచూస్తున్న చిత్రం పుష్ప–2 ది రూల్. పుష్ప ది రైజ్‌తో ప్రపంచ సినీ ప్రేమికులను అమితంగా ఆకట్టుకోవడమే ఇందుకు కారణం. ఈ చిత్రంలో ఐకాన్ స్టార్ నటనకు, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ దర్శకత్వ ప్రతిభకు అందరూ ఫిదా అయిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరి సన్సేషనల్ కలయికలో రాబోతున్న పుష్ప–2 ది రూల్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆకాశమే హద్దుగా అంచనాలు వున్నాయి. ఈ సంవత్సరం ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇక పుష్ప ది రైజ్ చిత్రంలో తన నటనతో మొట్ట మెదటిసారిగా తెలుగు కథానాయకుడు జాతీయ ఉత్తమ నటుడిగా అవార్డు తీసుకోవడం, మెట్ట మెదటిసారిగా దక్షిణ భారతదేశ నటుడు దుబాయ్ లో మ్యాడమ్ టుసార్ట్‌లో స్టాట్యూ కలగటమే కాకుండా మెదటి తెలుగు నటుడుగా గ్యాలరీ ని ఏర్పాటు చేయటం తెలుగు వారందరికి గర్వకారణం.

## వీవ్ ఆఫ్ కల్చర్ కు దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు

14 వ దాదా సాహెబ్ ఫాల్కే ఫిలిం ఫెస్టివల్ వేడుకలో ఎదుగుతున్న ఫిలిం మేకర్స్ మేధాశక్తికి వేదికగా మారింది. వీవీ ఆఫ్ కల్చర్ షార్ట్ ఫిలిం ఉత్తమ స్టూడెంట్ షార్ట్ ఫిలింగా అవార్డు గెలుచుకుంది. దాదాసాహెబ్ ఫాల్కే ఫిలిం ఫెస్టివల్ వేడుక ఇండియాలోనే అత్యంత గుర్తింపు పొందిన సినిమా వేడుక. వీవీ ఆఫ్ కల్చర్ చిత్రాన్ని సంతోష్ రామ్ మావూరి దర్శకత్వంలో తెరకెక్కింది. ఆయన నెల్లూరుకు చెందిన వ్యక్తి. లాస్ ఏంజిల్స్ లో సంతోష్ ఫిలిం మేకింగ్ లో మాస్టర్స్ చేశారు. ఈ చిత్రంలో చేనేత కార్మికుల వస్త్రాలని, వారి ప్రతిభని క్షుణ్ణంగా చూపించారు. స్పష్టమైన కథాంశం మరియు అద్భుతమైన సినిమాటోగ్రఫీ ద్వారా ఈ చిత్రంలో చేనేత కార్మికుల సంప్రదాయాలని కూడా చూపించారు. ఈ చిత్ర కథాంశం విషయానికి వస్తే... చేనేత వస్త్రాల తయారీలో ఒక కుటుంభం పేరు ప్రఖ్యాతలు సంపాదిస్తుంది. కుటుంభ పెద్ద ఆకస్మికంగా మరనించడం, చేనేత చీరలకు ప్రోత్సహం లభించక పోవడంతో ఆయన భార్య కుటుంభ పోషణ కోసం హ్యాండ్ లూమ్ ఫ్యాక్టరీలో అతితక్కువ వేతనానికి పని చేరుతుంది. ఇంజనీరింగ్ చదువుకుంటున్న తన కుమారుడు విజయ్‌ను ఉన్నత చదువుల కోసం అమెరికా పంపాలి అనుకుంటుంది, అందుకు కావాల్సిన డబ్బు కోసం తన ఇంటిని తాకట్టు పెట్టుకొని నగదు ఇవ్వమని ఫ్యాక్టరీ ఓనర్ ను కోరుతుంది., తరువాత ఏం జరిగింది అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుందని దర్శక నిర్మాతలు తెలిపారు.



## ‘లవ్ మీ’ ఓ డిఫరెంట్ మూవీ


### - నిర్మాత దిల్ రాజు

ఆశిష్, వైష్ణవి చైతన్య హీరో హీరోయిన్లుగా శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం ‘లవ్ మీ’. ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకత్వాన్ని వహించారు. ‘ఇఫ్ యు డేర్’ అనేది ఉప శీర్షిక. . ఈ హారర్ థ్రిల్లర్‌ను ప్రపంచ వ్యాప్తంగా మే 25న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ప్రీ రిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ కార్యక్రమంలో...ఏస్



ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ మాట్లాడుతూ “ఆశిష్ హండ్రెడ్ పర్సెంట్ ప్రామిసింగ్ పర్సనాలిటీ. ఇలాంటి యంగ్ హీరో ఈ బ్యానర్‌లో వర్క్ చేస్తే మంచి ఫలితం రావటం తథ్యం. ఇది తనకు బిగినింగ్ మాత్రమే. డైరెక్టర్ అరుణ్‌ని కలిశాను. కొత్త వాళ్లతో సినిమా చేసే ధైర్యం దిల్ రాజు అండ్ కో మాత్రమే సాధ్యం. యంగ్ టీమ్‌కి కీరవాణిగారు, పి.సి.శ్రీరామ్ వంటి స్టార్ టెక్నీషియన్స్‌తో పని చేసే అవకాశం రావటం వారికి దక్కిన అదృష్టం.బేబీలో ఓ ఊపు ఊపేసిన వైష్ణవి చైతన్య లవ్‌మీలో చక్కగా నటించిందని ట్రైలర్ చూస్తుంటే అర్థమైంది. ఆల్ ది బెస్ట్ టు లవ్ మీ టీమ్” అన్నారు. డైరెక్టర్ రవికిరణ్ కోలా మాట్లాడుతూ “లవ్ మీ’ అనౌన్స్‌మెంట్ రోజు నుంచే అందరిలో ఆసక్తి నెలకొంది. కీరవాణి, పి.సి.శ్రీరామ్ వంటి లెజెండ్స్ తోపాటు దిల్ రాజుగారి వంటి బలం కొత్త దర్శకుడైన అరుణ్ వెనుక నిలబడింది.

## ఇండస్ట్రీలో వివ పాత్ర ప్రత్యేకం



ఆ అక్షరాలకు ‘ముహూర్తం’ పెట్టారంటే సినిమా ‘సూపర్’ హిట్ కొట్టాల్సిందే..! ఎలాంటి సబ్జెక్టుకైనా ‘రెడీ’ అంటూ ‘దూకుడు’ చూపించాల్సిందే.. ఆ కుంచె నుంచి ‘పరుగు’ తీసే అక్షరాలు ప్రేక్షకుల గుండెల్లో ‘దిల్’గా నిలిచి పోతాయి. సినిమా అనే ‘బొమ్మరిల్లు’లో ‘దేశముదురు’, ‘పోకిరీ’, ‘డాన్ శీన్’, ‘ఆర్య2’, ‘అప్పలరాజు’, ‘శివమణి’, ‘ఏకలవ్యుడు’, ‘దొంగోడు’, ‘అగడు’.. ఇలా ఎలాంటి వారికైనా ఆ కుంచె ఓ రూపమిస్తుంది. నిరంతరం ‘కితకితలు’ పెడుతూ ‘ఇంకోసారి రెడీ’ అంటూ పాతికేళ్లుగా నిరంతరం వెలుగుతోంది వివ రెడ్డి అనే ఓ అక్షర ‘ఆయుధం’. వివ.. అంటే ‘విష్ణువర్ధన్ రెడ్డి మావూరపు’కి షార్ట్ కట్. ఈ పబ్లిసిటీ డిజైనర్ చేతిలో రూపొందే ‘చిత్రం’.. చలనచిత్రాన్ని పరిచయం చేస్తుంది.. సినిమా ఇతివృత్తమేంటో చెబుతుంది. ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. థియేటర్‌లకు పరుగులు పెట్టిస్తుంది. అంతటి శక్తి ఉన్న వివ కుంచెకు పాతికేళ్లు నిండాయి. ఇదే సమయంలో ‘ఈనాడు’ (మే 24న) విష్ణువర్ధన్ రెడ్డి జన్మదినం జరుపుకుంటున్న సందర్భంగా స్పెషల్ స్టోరీ. సినీ ‘ప్రస్థానం’ ఇలా...అనుకున్న రంగంలో విజయం సాధిస్తే జీవితంలో ఎంతో సంతృప్తి ఉంటుంది. వరంగల్‌కు చెందిన విష్ణువర్ధన్ రెడ్డిది దిగువ మధ్యతరగతి కుటుంబం.

# కల్కి2989 కోసం బుజ్జి రాక

రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన ప్రతిష్టాత్మక గ్లోబల్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఎడి నిర్మాతలు కస్టమ్–మేడ్ వాహనాన్ని విడుదల చేయడానికి హైదరాబాద్ లో ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు మరియు బుజ్జిని ప్రపంచానికి పరిచయం చేయడానికి దాదాపు 1 నిమిషం నిడివి గల టీజర్ ను కూడా విడుదల చేశారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన ఈ వేడుకకు పెద్ద ఎత్తున జనాలు హాజరయ్యారు. రెగ్యులర్ ఫిల్మ్ ఈవెంట్‌ల మాదిరిగా కాకుండా, ఈ ఈవెంట్‌లో బైకర్లు కొన్ని అద్భుతమైన విన్యాసాలు చేశారు. అమెరికాస్ గాట్ టాలెంట్ సీజన్ 2ను గెలుచుకున్న ముంబైకి చెందిన వి.అన్‌బీటబుల్ జట్టు వేదికపై ప్రభాస్ మెడ్లీపై ప్రదర్శన ఇచ్చింది, ఇది ప్రధాన హైలైట్ లలో ఒకటి. కస్టమ్ మేడ్ వెహికల్ బుజ్జి బిల్డింగ్ వెనుక ఉన్న టీమ్‌ని నాగ్ అశ్విన్ పరిచయం చేశాడు. “బుజ్జి పేరు చిన్నగా అనిపించినా అది మాకు చాలా ప్రత్యేకమైనది. కల్కి 2898 ఎడి తీయడం చాలా కష్టమైన చిత్రం. నేను ఇంజనీరింగ్ చేయలేదు. నేను సహాయం కోసం ఆనంద్ మహీంద్రాకు ట్వీట్ చేసాను. అతను తన బృందాన్ని యాక్టివేట్ చేశాడు. వారు మమ్మల్ని కోయంబత్తూర్ లోని జయం మోటార్స్ కు తీసుకువెళ్లారు. ఇది చాలా ప్రయోగాత్మక రేసింగ్ కార్–బిల్డింగ్ కంపెనీ. ఇలాంటి ఫీచర్లతో కూడిన కారును తయారు చేసేందుకు భారీ పరిశోధన అవసరం. ఇది మేము ఇక్కడ తీసివేసిన విషయం. కారు భారీగా ఉంది. మేము దానిని కల్కి మరియు భైరవ కోసం అంచెలంచెలుగా అనుకూలీకరించాము మరియు నిర్మించాము. మహీంద్రా టీమ్ మొత్తానికి, జయం మోటార్స్ టీమ్ మరియు కల్కి టీమ్‌కి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ప్రభాస్ మాట్లాడుతూ “నా దర్శకుడు నాగ్ అశ్విన్ నన్ను 3 సంవత్సరాలు టార్చర్ పెట్టాడు. ఈ కార్యక్రమానికి క్యాజువల్‌గా రావాలనుకున్నాను. కానీ నాగ్‌అశ్విన్ నన్ను ఈ విన్యాసాలు చేసేలా చేశాడు. క్యూరియాసిటీని పెంచడానికి ‘ఎవరో స్పెషల్’ అనే ట్వీట్ ను పోస్ట్ చేయాలనేది నా దర్శకుడి ఆలోచన. ఇది పబ్లిసిటీలో భాగమైంది. బుజ్జి చాలా ప్రత్యేకం. మీరు నన్ను ఎన్నుకోమని అడిగితే, నేను దాని మెదడు కంటే ,బుజ్జి శరీరాన్ని ఎంచుకుంటాను. మీ అందరిలాగే నేను కూడా సినిమా చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. బుజ్జి టీజర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నాను.



## దర్శకుడిగా మారుతున్న మరో కొరియోగ్రాఫర్ సతీష్ రాజ్

తెలుగు తెరపై ఇప్పటిదాకా పలువురు కొరియోగ్రాఫర్లు దర్శకులుగా మారారు. ప్రభుదేవా, లారెన్స్, విజయ్ బిన్నీ, గణేష్ మాస్టర్ లాంటి కొరియోగ్రాఫర్స్ దర్శకులుగా మారి భారీ సినిమాలు రూపొందించారు. ఈ ప్రముఖ కొరియోగ్రాఫర్స్ బాట లోనే మరో కొరియోగ్రాఫర్ సతీష్ రాజ్ కూడా చేరబోతున్నారు. ఈనేపథ్యంలోనే ఎస్ ఆర్ మూవీ జంక్షన్ పేరుతో ఓ బ్యానర్ ను స్థాపించారు. ఈ బ్యానర్ లోగోను ప్రముఖ నటులు మురళి మోహన్ ఆవిష్కరించారు. సతీష్ రాజ్ స్వయంగా సాయి బాబా భక్తుడు అవడంతో స్వీయ దర్శకత్వంలో సినిమా ప్రారంభించే తన



ఇష్టదైవమైన సాయి బాబా కు అంకితం ఇవ్వాలే ఆశయంతో శ్రద్ధ సబూరి పేరుతో ఓ పాటను రూపొందించారు. ఈ పాటను ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్, విజయ్ బిన్నీ మాస్టర్ , ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ కలిసి ఆవిష్కరించారు. ఒక దర్శకుడు సినిమా మొత్తాన్ని మూడు గంటల్లో చూపిస్తే కేవలం మూడు నిమిషాల్లో కథ మొత్తం అర్థమయ్యేలా ఒక్క పాటలో చూపించగలిగిన దర్శకుడే కొరియోగ్రాఫర్ అని ఈ సందర్భంగా మురళి మోహన్ అన్నారు. సతీష్ రాజ్ లాంటి కొరియోగ్రాఫర్లు దర్శకులుగా మారడం వల్ల చిత్రపరిశ్రమలో ఎంతో మంచి సినిమాలు వస్తాయని చెప్పారు. సినిమా ప్రారంభించే ముందు సాయి బాబాకు పాటను అంకితం ఇవ్వడం సతీష్ రాజ్‌కు సినిమా పై ఉన్న పట్టుదలను తెలియజేస్తున్నదన్నారు. దర్శకుడిగా మారుతున్న సతీష్ రాజ్ ను మురళి మోహన్ అభినందించారు. ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి కొరియోగ్రాఫర్ ఒక దర్శకుడేనని అన్నారు.

## “యక్షిణి”లో జ్వాలగా...

ఆర్కా మీడియా వర్క్స్, డిస్నీ ప్లస్ హాట్ స్టార్ కాంబినేషన్ లో వస్తున్న మరో ఇంట్రెస్టింగ్ వెబ్ సిరీస్ “యక్షిణి”. ఈ వెబ్ సిరీస్ ను శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని నిర్మిస్తున్నారు. వేదిక, మంచు లక్ష్మి, రాహుల్ విజయ్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. దర్శకుడు తేజ మార్ని “యక్షిణి” సిరీస్ ను రూపొందిస్తున్నారు. మిస్టీరియస్ జ్వాల అంటూ స్పెషల్ పోస్టర్ ద్వారా “యక్షిణి” వెబ్ సిరీస్ నుంచి మంచు లక్ష్మి నటించిన జ్వాల క్యారెక్టర్ ను ఇంట్రడ్యూస్ చేశారు. ఫాంటసీ, రొమాన్స్, కామెడీ అంశాలతో రూపొందిన “యక్షిణి” ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. డైరెక్టర్ తేజ మార్ని విజన్ కు తగినట్లు భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్ తో ఆర్కా మీడియా వర్క్స్ ఈ సిరీస్ ను నిర్మించింది. జూన్ లో తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీలో “యక్షిణి” వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది.



## ‘రాజు యాదవ్’ ఫన్ అండ్ ఎమోషనల్ రైడ్

బుల్లి తెర కమల్ హాసన్‌గా పాపులరైన జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను హెూల్సమ్ ఎంటర్ టైనర్ ‘రాజు యాదవ్’ తో హీరోగా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రం ద్వారా కృష్ణమాచారి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై కె. ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ ఏపీ, తెలంగాణలో గ్రాండ్‌గా విడుదల చేయబోతున్నారు. మే 24న రాజు యాదవ్ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో హీరో గెటప్ శ్రీను విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు. హీరోగా చేయాలని ప్లాన్ చేసుకోలేదు. ఇప్పటివరకూ నటనకు ఎక్కువ స్కోప్ వున్న పాత్రలని చేయడానికి ప్రయత్నించాను. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్ గానే స్థిరపడాలని అనుకున్నాను. రాజు యాదవ్ కథ విన్నాక ఫుల్ లెంత్ పెర్ఫార్మెన్స్ చేసే అవకాశం కలుగుతుందనిపించింది. అందుకే ఈ సినిమా చేశాను. నా వరకూ ఇది నేను చేస్తున్న ఫుల్ లెంత్ క్యారెక్టర్ గానే భావిస్తాను. చాలా కష్టంతో కూడుకున్న పాత్రిది. ఈ పాత్ర చేస్తున్నప్పుడు ఒకానొక దశలో ఆర్టిస్ట్‌గా ఫెయిల్ అయిపోయానేమో అనుకునే సందర్భాలు కూడా వున్నాయి. ఒక సీన్ చేస్తునపుడు చాలా కష్టంగా సవాల్‌గా అనిపించింది. అయితే దర్శకుడు చాలా స్ఫూర్తిని ఇచ్చి ఈ పాత్ర చేయించారు. ముందు నా పాత్ర గురించి చెప్పారు. భలే అనిపించింది. తర్వాత కథ పూర్తిగా చదివాను. చాలా నచ్చింది. చాలా రియలెస్టిక్‌గా వుండే సినిమా ఇది. విజువల్స్, సన్నివేశాలు, డైలాగ్స్ ఇవన్నీ సహజత్వంతో నిండివుంటాయి. ప్రస్తుతం ఆడియన్స్ కంటెంట్ వున్న రియలెస్టిక్ సినిమాలని అదరిస్తున్నారు. ఈ సినిమా కూడా తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం వుంది. రాజుయాదవ్ ఫన్ అండ్ ఎమోషన్ రైడ్. తల్లితండ్రులు తమ కొడుకు నుంచి ఏం కోరుకుంటున్నారు ? అలాగే కొడుకు కోణంలో తల్లితండ్రులు ఎలా వుండాలి? తల్లితండ్రుల కలని సాకారం చేయడానికి ఎన్ని అడ్డంకులు వచ్చినా వెనకడుగు వేయకూడదనే అంశం ఈ కథకు మూలం. కృష్ణమాచారి గారు నీది నాది ఒకే కథ, విరాట పర్వం, అలాగే ఒక స్పానిస్ సినిమాకి సహాయ దర్శకుడిగా పని చేశారు. ఆయన కథ చెప్పే విధానం చాలా నచ్చింది. చాలా సహజత్వంతో సినిమాని తీశారు. ఫన్ తో పాటు ఎమోషన్ ని చాలా అద్భుతంగా చూపించారు.



## బార్బీ డాల్ పాయల్

మంచు మనోజ్ హీరోగా నటించిన ప్రయాణం చిత్రంతో టాలీవుడ్‌కి పరిచయం అయిన ముద్దుగుమ్మ పాయల్ ఘోష్. తెలుగు లో మొదటి సినిమాతోనే క్యూట్ బ్యూటీ అన్న పేరు దక్కించుకుంది. కానీ అదృష్టం కలిసి రాకపోవడంతో అవకాశాలు అం తంత మాత్రమే అన్నట్లుగా వచ్చాయి. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల విందు ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో ఉంటున్న ఈ అమ్మడు తాజాగా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. ఈసారి బార్బీ డాల్ అవతారంలో పాయల్ తన ఫోటోను షేర్ చేసింది. క్లోజప్ లో అందాల బార్బీ డాల్ పాయల్ యొక్క అందంకు నెటిజన్స్‌కు ఫిదా అవుతున్నారు. క్లీ వేజ్ షోతో మతి పోగొడుతున్న ఈ అమ్మడిని నెటిజన్స్ ఆహా ఓహెూ అంటూ తెగ ప్రశంసిస్తున్నారు. పాయల్ ను ఈ మేకోవర్ లో గుర్తు పట్టలేకున్నాం అంటూ కొందరు కామెంట్స్ చేస్తే మరి కొందరు సింప్లీ సూపర్ అన్నట్లుగా కామెంట్స్ చేస్తు న్నారు. పాయల్ అందాల షోకు గతంలో నెటిజన్స్ ఫిదా అయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. అయితే ఈసారి చాలా ప్రత్యేకం అన్నట్లుగా ఈ ఫోటో లను చూస్తే అనిపిస్తుంది.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044